# భారత రాజ్యాంగం

## (సంక్షిప్తం)



**దేవేంద్ర ఫౌండేషన్**

8-2-50, రోడ్ నెంబర్ 7, బంజారాహిల్స్,

హైదరాబాద్ - 500034,

తెలంగాణ రాష్ట్రం

# భారత రాజ్యాంగం

**(సంక్షిప్తం)**

**ప్రథమ ముద్రణ:**
జనవరి 2020

**ప్రతులు:** 1000
**వెల:** రూ.50

**ప్రచురణ:**
**దేవేంద్ర ఫౌండేషన్**
8-2-503, రోడ్ నెం.7,
బంజారాహిల్స్, హైదరాబాద్.
పిన్‌కోడ్: 500034
తెలంగాణ రాష్ట్రం

**డిజైనింగ్ :**
బాలు పాలోజి
**డిటిపి** :
ఇస్మాయిల్ బేగ్

**ముద్రణ:**
కర్షక్ ప్రింటర్స్
విద్యానగర్, హైదరాబాద్

భారతీయులందరికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏకైక మార్గదర్శి అయిన 'భారత రాజ్యాంగం' సంక్షిప్తంగానైనా అందరికీ తెలియాలి అనే ఉద్దేశంతో మాజీమంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీ టి. దేవేందర్ గౌడ్ ఈ పుస్తకాన్ని అందిస్తున్నారు. తన 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవంలో.. రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్‌గా, ఉమ్మడి రాష్ట్రంలో జడ్పీల సంఘం కన్వీనర్‌గా, 3 పర్యాయాలు ఎమ్మెల్యేగా, 10 సంవత్సరాలు క్యాబినెట్ మంత్రిగా, 6 ఏళ్లు రాజ్యసభ సభ్యునిగా పనిచేసిన శ్రీ టి. దేవేందర్ గౌడ్ ఈ పుస్తకంలో భారత రాజ్యాంగం యొక్క విశిష్ఠత, సమసమాజ నిర్మాణానికి రాజ్యాంగం పరచిన బాటలు.. ఆచరణలో రాజ్యాంగ సూత్రాలను, స్ఫూర్తిని దెబ్బతీస్తున్న ఫలితంగా గత కొన్ని దశాబ్దాలుగా సమాజంలోని అన్ని రంగాలలో ఉత్పన్నమైన అవలక్షణాలు, వాటి వల్ల కలిగిన దుష్ఫలితాలను వివరిస్తూనే.. అదేసమయంలో అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం, దేశంలో ఉన్న విలువైన మానవ వనరుల నేపథ్యంలో.. భారత రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేసుకొన్నట్లయితే భవిష్యత్తులో ఒనగూరే అద్భుత ఫలితాలను సూటిగా, స్పష్టంగా సాధికారతతో వివరించారు.

# ప్రజాస్వామ్య ప్రాణదీపం భారత రాజ్యాంగం

## (నా అనుభవం)

– టి. దేవేందర్‌గౌడ్

మనిషి ప్రాథమికంగా సంఘజీవి కనుక.. ప్రజలు ఇతరుల స్వేచ్ఛకు భంగం కలగనిరీతిలో తాము స్వేచ్ఛగా జీవిస్తూ పరస్పర సహాయ సహకారాలు అందిపుచ్చుకునే వ్యవస్థలోనే మెరుగైన జీవన ప్రమాణాలు సాధించగలరని, అందుకు ప్రజాస్వామ్య వ్యవస్థ అనువైనదని రాజకీయ తత్వవేత్తలు అనుభవపూర్వకంగా తెలిపారు. వేల సంవత్సరాల చరిత్రగల మానవ పరిణామక్రమంలో.. వివిధ కాలాల్లో ప్రపంచ వ్యాప్తంగా అనేక పాలనా వ్యవస్థలు రూపుదిద్దుకొన్నాయి. ప్రజల మధ్య సమస్యలు, ఇబ్బందులు తలెత్తితే వాటిని పరిష్కరించడం; స్వేచ్ఛగా, సమష్టిగా నిర్ణయాలు తీసుకోగలిగే అవకాశం మిగతా వ్యవస్థలకంటే ప్రజాస్వామ్య వ్యవస్థలోనే అనుకూలత ఎక్కువని ప్రకటించారు. ప్రపంచంలోని పలు దేశాలు ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థలను అనుసరిస్తున్నాయి. చక్కటి ఫలితాలను సాధిస్తున్నాయి.

స్వాతంత్ర్యం లభించాక భారతదేశానికి అనువైన పాలనావ్యవస్థ ఏదైతే బాగుంటుందనే చర్చ స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న సమయంలోనే మొదలైంది. భారతదేశంలో అనేక వందల సంవత్సరాలపాటు ప్రజలతో సంబంధంలేని రాజ్యాలు ప్రజలను పాలించాయి. ప్రజలతో ప్రమేయం

లేకుండానే వందల సంవత్సరాలపాటు పరిపాలన సాగింది. అయితే, ప్రపంచంలో ఏ దేశంలోలేనంత వైవిధ్యం భారతదేశంలో కనిపిస్తుంది. నైసర్గికంగా.. దేశానికి మూడు వైపులా విశాలమైన సముద్రాలు, ఉత్తరాన ఎత్తైన హిమాలయాలు, భిన్నమైన వాతావరణ పరిస్థితులు, రకరకాల సంస్కృతీ సంప్రదాయాలు, వివిధ భాషలు, కులాలు, వర్గాలు, తెగలు, మతాలు.. ఇలా ఒక ప్రాంతానికి మరోప్రాంతానికి పలు వైరుధ్యాలు ఉన్నప్పటికీ.. ప్రజలు అనాదిగా కలసిమెలసి ఉన్నారు. అంతా ఒక్కటే అనే జాతీయతాభావం, పరమత సహనం, పరస్పర సహకారంతో సమష్టి జీవనం సాగించారు. ఈ పరంపర నేపథ్యంలోనే.. భారతదేశానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థే సరియైనదిగా పెద్దలు భావించారు. 1947, ఆగస్టు 15న భారతదేశానికి బ్రిటీష్ వలస పాలన నుండి విముక్తి లభించిన తర్వాత దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను రాజ్యాంగ కర్తలు ఏర్పాటు చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు, ప్రజలకు దిక్సూచిగా భారత రాజ్యాంగాన్ని రూపొందించే బాధ్యతను డా॥ బి.ఆర్ అంబేద్కర్ నేతృత్వంలోని కమిటీ స్వీకరించింది.

1949 నవంబర్ 26న రాజ్యాంగ శిల్పి డా॥ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ ముసాయిదా ప్రతిని సమర్పించే సందర్భంలో ఇలా అన్నారు. **“మనం వైరుధ్యాల మయమైన జీవితంలోకి ప్రవేశించబోతున్నాం. రాజకీయాల్లో మనకు సమానత్వం ఉంటుంది. ఆర్థిక జీవనంలో అసమానత ఉంటుంది. మనుషుల మధ్య ఉన్న ఆర్థిక వైరుధ్యాలను వీలైనంత త్వరగా తొలగించి తీరాలి. లేకపోతే, ఎంతో శ్రమించి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్య సౌధాన్ని అసమానతలు అనుభవిస్తున్నవారు ధ్వంసం చేస్తారు”** అని హెచ్చరించారు. అందుకే దేశంలోని సహజవనరులు అందరికీ చెందాలని.. ఆర్థిక వనరులన్నీ ఏ కొద్దిమంది చేతుల్లోకో వెళ్లకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించాలని రాజ్యాంగం నిర్దేశించింది. రాజ్యాంగ స్ఫూర్తికి లోబడే అన్ని వ్యవస్థలూ పని చేయాలని సూచించింది. ప్రభుత్వం లక్ష్యాలేమిటో 'ప్రవేశిక' లో పొందుపరిచింది. వీటి సాధనకై భారత రాజ్యాంగం **1) శాసన 2) కార్యనిర్వాహక 3) న్యాయ వ్యవస్థలను** పరస్పర ఆధారితంగా ఏర్పరిచింది. ఇందులో న్యాయవ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తి ఉంది. ఈ మూడింటితోపాటు.. సమాచార వ్యవస్థ, పత్రికా రంగం ప్రజాస్వామ్య

**మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి. దేవుడి మీద, మహానుభావుల మీద ఆధారపడవద్దు - డా.బిఆర్. అంబేద్కర్**

సౌధానికి నాలుగో పిల్లర్‌గా రూపుదిద్దుకొంది. లిఖిత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా భారతదేశం రూపుదిద్దుకుంది. అయితే, రాజ్యాంగం ఆశించిన విధంగా ఈ వ్యవస్థల్లో మెజార్టీ ప్రజలకు సముచిత భాగస్వామ్యం దక్కలేదు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు.

## శాసన వ్యవస్థ

స్వాతంత్ర్యానంతరం.. దేశంలోని ఆయా వర్గాల దామాషా ప్రకారం ప్రజాప్రతినిధులు చట్టసభలకు ఎంపికై.. తమ వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అనువైన శాసనాలను, చట్టాలను రూపొందించి అమలు చేస్తారని ఆశించడం జరిగింది. కానీ, బ్రిటీష్ నాటి రాచరిక వ్యవస్థలో ఎవరైతే వారికి తాబేదార్లుగా సహకరించి పాలించారో.. ఆ వర్గాలవారే తమ వేషభాషల్ని మార్చుకొని ఎన్నికల్లో నిలబడి అధికారాన్ని హస్తగతం చేసుకొన్నారు. తదుపరి ఎన్నికల ప్రక్రియను ఓ ప్రహసనంగా మార్చి డబ్బు, కులం, ప్రాంతం వంటి అంశాలను తమకు అనుకూలంగా మార్చుకొని అధికారాన్ని శాశ్వతం చేసుకోవడానికి అన్ని రకాలుగా దిగజారుతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం అన్నది కాగడాపెట్టి వెతికినా కనపడదు. అధికారమే పరమావధిగా రాజకీయ పార్టీలు డబ్బు, కులం, మతం ప్రాతిపదికగా అభ్యర్థులను నిలబెడుతున్నాయి. ధనవంతులకు పార్టీ టికెట్లు ఇస్తూ ఎన్నికలను ఖరీదైన వ్యవహారంగా మార్చివేశాయి. ఫలితంగా, శాసనసభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికలలో గెలవడానికి అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు కోట్లు ఖర్చు పెట్టాల్సిన దుస్థితి నేడు దేశంలో నెలకొంది. రాజకీయ వ్యవస్థలో, మొత్తంగా సమాజంలో తిష్టవేసుకున్న నల్లధనం, అవినీతి మొదలైన రుగ్మతలను రూపుమాపే బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధులు.. తాము ఎన్నిక కావడానికే అనేక అడ్డదారులు తొక్కుతూ, అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతున్న నేపథ్యంలో.. అటువంటి వ్యక్తులు కలుషితమైన వ్యవస్థలను ప్రక్షాళన చేస్తారని ఆశించడం అత్యాశే అవుతుంది.

**ఎవరయితే ధర్మాన్ని సరిగ్గా నిర్వర్తిస్తారో వారే దేశాన్ని ఉద్ధరించగలరు**
***– డా. బిఆర్. అంబేద్కర్***

చిత్తశుద్ధి, నైతిక విలువలు లేని వ్యక్తులు అధిక సంఖ్యలో చట్టసభలకు ఎన్నికవుతున్న ఫలితంగా.. చట్టసభల ఔన్నత్యం, వాటి పనితీరు నానాటికి దిగజారిపోతోంది. **మనది ప్రాతినిధ్య ప్రజాస్వామ్య వ్యవస్థ.. చట్టసభల్లో ప్రజలందరూ కూర్చోజాలరు. కనుక, వారు తమ ప్రతినిధులను 5 ఏళ్ల పాటు చట్టసభలకు ప్రాతినిధ్యం వహించేందుకు ఎన్నుకుంటారు.** కాని వారి వైఖరిని గమనిస్తే.. తాము ఐదేళ్లకు ప్రజలు ఎన్నుకొన్న ప్రజాప్రతినిధులం అనే స్పృహ లేకుండా రాచరిక వ్యవస్థకు ప్రతిరూపంగా, చక్రవర్తులుగా తమను తాము భావించుకుంటున్నారు. **ప్రజల కోసం, ప్రజల చేత ప్రజాప్రతినిధులే పరిపాలిస్తారు అనే రాజ్యాంగ ప్రాథమిక సూత్రం మరుగున పడిపోయింది.** మన ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో 5 ఏళ్లకు ఎన్నుకోబడే ప్రజాప్రతినిధులకు రాజ్యాంగం ద్వారా అధికారాలు సంక్రమిస్తాయి. రాజ్యాంగం అధికారాలతోపాటు కొన్ని బాధ్యతలను కూడా అందించిన విషయాన్ని మర్చిపోరాదు.

స్వాతంత్ర్యం లభించిన తదుపరి 3 దశాబ్దాల పాటు ఒకే రాజకీయ పార్టీ అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రాలలో అధికారం చెలాయించగలిగింది. ప్రతిపక్షమే లేనప్పటికీ పరిపాలన సజావుగా సాగలేదు. అధికారం చేజిక్కించుకోవడానికి స్వపక్షంలోనే గ్రూపు తగాదాలు, కీచులాటలు పెరిగి వాటి కారణంగా పరిపాలన కుంటుబడి అభివృద్ధి తిరోగమన మార్గం పట్టిన పరిస్థితులు చరిత్రలో అడుగడుగునా కనిపిస్తాయి. జాతీయ పార్టీలకు పోటీగా మన దేశంలో ఏర్పాటైన పలు ప్రాంతీయ పార్టీలను పరిశీలిస్తే.. అందులో అనేక పార్టీలు క్రమేపీ లిమిటెడ్ కంపెనీలుగా మారాయి.

## కార్యనిర్వాహక వ్యవస్థ

ప్రభుత్వ కార్యక్రమాలను సక్రమంగా, పారదర్శకంగా, అవినీతిరహితంగా అమలుపరిచే బాధ్యత కార్యనిర్వాహక వ్యవస్థదే. ప్రభుత్వం అనేది సచివాలయానికి పరిమితం కాకుండా అన్నిచోట్లకు విస్తరించాలి. గ్రామస్థాయిలో సచివాలయాలు ఏర్పడి అక్కడి నుండి పరిపాలన సాగాలి. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థానిక ప్రభుత్వాల ద్వారానే సాధ్యపడుతుంది. గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థ ఉంటే.. ప్రజలు ఎదుర్కొనే అత్యధిక సమస్యలు గ్రామంలోనే పరిష్కారం అవుతాయి. ప్రజలు తమ

**ఒక వర్గాన్ని ఇంకొక వర్గంపైకి ఉసిగొల్పే ధోరణి చాలా ప్రమాదకరం**
***– డా. బిఆర్. అంబేద్కర్***

సౌకార్యార్థం ఏర్పర్చుకున్న వ్యవస్థ.. తమకు లేని అధికారాలను ఆపాదించుకొని ప్రజలను తమ చుట్టూతిప్పుకునే వ్యవస్థగా రూపొందింది. మరోపక్క ప్రభుత్వ యంత్రాంగాన్ని అధికారంలో ఉన్నవారు తమ సొంత పనులకు వాడుకుంటున్నారు. అధికార వికేంద్రీకరణను అడ్డుకొని కేంద్రీకృత విధానాలతో అధికారాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొనే విధానాలను అమలు చేస్తున్నారు. రాజ్యాంగంలోని కీలక వ్యవస్థలో ఒకటైన కార్యనిర్వాహక వ్యవస్థ ఎవరు అధికారంలో ఉంటే వారి అవసరాలను యధాతథంగా నెరవేరుస్తూ ప్రస్తుతం తన అస్థిత్వాన్ని కోల్పోయింది. రాజ్యాంగ విధులను, ధర్మాలను పాటించేవిధంగా కార్యనిర్వాహక వ్యవస్థను తీర్చిదిద్దాలి. మన దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే.. వారు తమ ముద్ర చూపడానికి అంతకుముందు అధికారంలో ఉన్న వారు చేసిన పనులను, విధానాలను మార్చేస్తున్నారు. ఇది మంచిది కాదు. ప్రభుత్వం అన్నది ఓ నిరంతర ప్రక్రియ. విలువైన ప్రజాధనాన్ని దుర్వినియోగపర్చకుండా ధర్మకర్తగా వ్యవహరించాల్సిన బాధ్యత అధికారంలో ఉండేవారిపై ఉంటుంది.

## న్యాయ వ్యవస్థ

భారతీయ సంస్కృతిలో న్యాయ వ్యవస్థను న్యాయ దేవతగా పరిగణిస్తారు. ప్రజలకు ఈ వ్యవస్థపై ఎంతో నమ్మకం ఉన్నప్పటికీ.. వ్యవస్థలోని లొసుగుల కారణంగా ప్రజల అవసరాలమేరకు ఈ వ్యవస్థ పనిచేయలేకపోతోంది. ప్రజలను పీడించే దళారులను, నేరస్థులను కాపాడటానికే న్యాయ వ్యవస్థ ఉన్నదనే సందేహం కూడా ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. తీవ్రమైన నేరాలకు పాల్పడే అసాంఘిక శక్తులకు తగిన శిక్షలు పడటంలేదన్న అభిప్రాయం కూడా ప్రజల్లో ఉంది. న్యాయ స్థానాల వద్ద అపరిష్కృత కేసులు లక్షల సంఖ్యలో పేరుకుపోతున్నాయి. న్యాయం జరగడానికి విపరీతమైన జాప్యం జరుగుతోంది. సమాజంలో ఎప్పటికప్పుడు చోటుచేసుకుంటున్న పరిణామాలతో అనేక కొత్త సమస్యలు ఉత్పన్నమై న్యాయ వ్యవస్థపై అధిక భారం పడుతోంది. ఎప్పుడైతే.. సామాన్యులకు న్యాయం దక్కదో అప్పుడు ప్రజాస్వామ్యానికి అర్థం ఉండదు. దేశంలో ప్రజాస్వామ్యం క్రిందిస్థాయికి విస్తరించాలంటే న్యాయవ్యవస్థను వికేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. అతి సామాన్యుడికి సైతం

న్యాయ వ్యవస్థ మీద నమ్మకం ఏర్పడాలంటే.. అతనికి న్యాయం అన్నది వేగంగా, పారదర్శకంగా జరగాలి. గ్రామాల స్థాయిలో కూడా న్యాయ కేంద్రాలు ఏర్పాటు కావాలి. ఈ న్యాయ కేంద్రాలకు గ్రామ స్థాయిలోనే న్యాయాధికారులను నియమించాలి. ఉచితంగా లేదా నామమాత్రపు రుసుము చెల్లింపుతో ఎవరైనా న్యాయ కేంద్రాలను ఆశ్రయించి తమ సమస్యలను పరిష్కరించుకొనే అవకాశాన్ని కల్పించినట్లయితే.. ఎక్కడి సమస్యలు అక్కడ పరిష్కారమై ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. న్యాయం కోసం పోలీస్ స్టేషన్ల చుట్టూ.. క్రింది కోర్టు, హైకోర్టుల చుట్టూ తిరిగే దుస్థితి తొలగిపోవాలి. న్యాయ స్థానాల చుట్టూ తిరగడం ఓ శిక్షగా ప్రజలు భావించే పరిస్థితిలో మార్పు రావాలి. 'కంటెమ్ట్' (కోర్టు ధిక్కరణ) కారణంగా ఆ వ్యవస్థలోని లొసుగులు బయటకు రావడం లేదు. న్యాయవ్యవస్థలోని వ్యక్తులే దానిని మెరుగుపర్చక పోవడం సమంజసం కాదు. ఆధునిక పద్ధతుల ద్వారా సత్వర న్యాయం అందించాలి. న్యాయ వ్యవస్థకున్న స్వయం ప్రతిపత్తిని కాపాడుకొని దానిలోని వ్యక్తులు సంస్కరణలకు చొరవ చూపాలి. నిజాయితీపరులను, నీతివంతులను న్యాయమూర్తులుగా ఎంపికచేసి అందరికీ న్యాయవ్యవస్థకున్న గౌరవాన్ని మరింత పెంచాలి. అందుకు న్యాయ వ్యవస్థను వికేంద్రీకరించడం, అవసరమైన మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం, తదితర న్యాయ వ్యవస్థకు కావాల్సిన అవసరాలను చేకూర్చాలి.

## పత్రికా రంగం

రాజ్యాంగంలో ప్రత్యేకంగా పేర్కొనబడనప్పటికీ.. పత్రికారంగానికి తగినంత స్వతంత్ర ప్రతిపత్తి ఉంది. రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులు పత్రికా రంగం స్వేచ్ఛా స్వతంత్రాలకు కవచంగా ఉపయోగపడుతున్నదనడం అతిశయోక్తి కాదు. సరైన సమాచారం ఉంటే పౌరులు తగిన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. కానీ, ప్రస్తుతం పత్రికా మీడియా రంగం చాలావరకు సంపన్నుల చేతిలో ఆయుధంగా మారిపోయింది. మీడియా ద్వారా ప్రజలను ప్రభావితం చేయగలమన్న ఆలోచనతోనే కార్పొరేట్ శక్తులు మీడియాను తమ అధీనంలోకి తెచ్చుకుంటున్నాయి.

**సత్యం భగవంతుడి కన్నా గొప్పది – మహాత్మాగాంధీ**

## రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగ వ్యవస్థలు

ప్రజాస్వామ్యంలో చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ (సమతుల్యత)లో భాగంగా ఉన్న వ్యవస్థల్లో గవర్నర్ వ్యవస్థ ఒకటి. రాజ్యాంగబద్ధంగా ఎంపికయ్యే గవర్నర్‌కు స్పష్టమైన బాధ్యతలు, అధికారాలు ఉన్నాయి. గవర్నర్ రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి. అందుకు గవర్నర్‌గా ఎంపిక చేసే వ్యక్తికి ఏ రాజకీయ పార్టీలో కూడా సభ్యత్వం ఉండరాదు. గవర్నర్ వ్యవస్థతోపాటు ఇతర రాజ్యాంగ వ్యవస్థలైన – రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సిఏజి), ఎన్నికల ఛీఫ్ కమిషనర్, విజిలెన్స్ కమిషనర్ తదితర పదవులను అధిష్టించే వ్యక్తులు ఏ రాజకీయ పార్టీకి చెందనివారై ఉండాలి. ఆ పదవులు నిర్వహించి.. విరమణ పొందిన తర్వాత ఏ రాజకీయ పార్టీ కార్యకలాపాలలోనూ పాల్గొనకుండా నిబంధనలు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

## ఎన్నికల కమిషన్

రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన వ్యవస్థల్లో అతికీలకమైనది – ఎన్నికల కమిషన్. 7 దశాబ్దాల స్వతంత్ర దేశంలో అనేక ఎన్నికలు జరుపుకున్నాము. చెదురుమదురు సంఘటనలు తప్ప ఎన్నికలన్నీ ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల ఫలితాల తర్వాత అధికార మార్పు ప్రశాంతంగా జరుగుతూ వస్తోంది. అయితే, ఇటీవలికాలంలో స్వతంత్రంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా వ్యవహరించవలసిన ఎన్నికల కమిషన్ ఈనాడు ఆ అర్థాన్ని కోల్పోయే ప్రమాదంలో పడింది. ఎన్నికల కమిషన్ స్వతంత్రత, నిష్పక్షపాతం ప్రశ్నార్థకంగా మారాయి. ముఖ్యంగా.. ఎన్నికల సమయంలో కొన్ని రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా పెడుతున్న వ్యయాన్ని నియంత్రించలేకపోవడం, ఎన్నికల అవకతవకలను అరికట్టలేకపోవడం, ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్న వ్యక్తులపై, పార్టీలపై కఠినమైన చర్యలు తీసుకోవడంలో ఉదారంగా వ్యవహరించడం తదితర అంశాలకు సంబంధించి ఎన్నికల కమిషన్ పనితీరును ప్రజలు బహిరంగంగానే తప్పు పడుతున్నారు. అదేవిధంగా.. రాజకీయ పార్టీల

**కోట్లాది ప్రజల జీవితమే రాజకీయం**
**– మహాత్మాగాంధీ**

కార్యకలాపాలపై దృష్టి సారించకపోవడం, రాజకీయ పార్టీలకు అందుతున్న విరాళాలకు సంబంధించిన వ్యవహారాలపై ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. కొన్ని రాజకీయ పార్టీలు.. రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నప్పటికీ.. ఎన్నికల కమిషన్ వాటిపై కొరడా ఝుళిపించడం లేదు. సంఘ వ్యతిరేక శక్తులు, తీవ్ర నేరాలకు పాల్పడినవారు రాజకీయాల్లోకి ప్రవేశించి డబ్బులు పంచుతూ ఎన్నికవుతున్న విధానం ఇటీవల కాలంలో ఎక్కువైంది. కొన్ని రాజకీయ పార్టీలు పూర్తిగా డబ్బుపై ఆధారపడుతున్నాయి. ఒకప్పుడు కొన్ని రాజకీయ పార్టీలకు దిశానిర్దేశం చేయడానికి ప్రజాస్వామికవాదులు, సిద్ధాంతకర్తలు ఉండేవారు. ఇప్పుడు వారిబదులుగా కొన్ని పార్టీల్లో డబ్బున్నవారి మాటే చెల్లుబాటు అవుతోంది. వారు సూచించినవారికే పార్టీ టిక్కెట్లు లభిస్తున్నాయి. మొత్తంగా చూస్తే.. రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండటం లేదు. మరోవైపు ప్రజాప్రాతినిధ్య చట్టం అపహాస్యం పాలవుతోంది. ఈ విధంగా ప్రజాస్వామ్యాన్ని కొన్ని రాజకీయ పార్టీలు అవహేళన చేసే రీతిలో నడుచుకుంటున్నప్పటికీ.. ఎన్నికల కమిషన్ వాటిపట్ల ఉదాసీనంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా పరిణమించింది. ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమైన ఎన్నికల ప్రక్రియ ఓ క్రతువుగా, తంతుగా మారిపోవడం అందర్నీ కలవరపరుస్తోంది. ఎన్నికల కమిషన్ అంటే.. తాము అక్రమాలకు పాల్పడితే ఎన్నికల కమిషన్ ఎంతమాత్రం ఉపేక్షించదన్న భయం రాజకీయ పార్టీలకు, వ్యక్తులకు కలగాలి. ఎన్నికల జాబితాల రూపకల్పన మొదలుకొని, ఈవిఎంలు సక్రమంగా పనిచేయడం వరకూ అన్ని దశలలో కూడా ఎన్నికల కమిషన్ తన పాత్రను పారదర్శకంగా, స్వతంత్రంగా పనిచేయాలి.

రాజకీయ పార్టీలు ఓట్ల కోసం తమ ఎన్నికల ప్రణాళికల్లో అలవికాని హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం పరిపాటిగా మారింది. ఈ విధానాన్ని ఎన్నికల కమిషన్ సమీక్షించాల్సిన అవసరం ఉంది. బాధ్యతారహితంగా ఇష్టానుసారం హామీలు గుప్పించే రాజకీయ పార్టీలకు 'ఎన్నికల కమిషన్' ముకుతాడు వేయాలి. ఇచ్చేవారు, తీసుకునేవారు అనే విభజన రేఖ ప్రజాస్వామ్య మూల సూత్రాలకు విరుద్ధం. అలాగే, పాలితులు, పాలకులు అనే విభజన ప్రజాస్వామ్యం

**సమాజంలో ఏ మార్పునైతే కోరుకుంటావో**
**దానికి నువ్వే నాంది పలకాలి - మహాత్మాగాంధీ**

కాదు. ఎన్నికల కమిషన్ వీటిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా.. రాజకీయ పార్టీలు ప్రైవేటు కంపెనీలుగా మారకుండా అవి ప్రజావ్యవస్థలుగా ఉండి ప్రాతినిధ్య ప్రభుత్వాలు ఏర్పాటు చేసే వ్యవస్థలుగా రూపొందించే బాధ్యత ఎన్నికల కమిషన్‌దే. అందుకొరకు తీసుకునే చర్యల భాగంగా రాజకీయ పార్టీలకు అధ్యక్షులుగా ఉండేవారు ఆ పదవిని 2 పర్యాయాలు మాత్రమే చేపట్టాలన్న నిబంధనను తేవాలి. నేరం చేసిన ప్రజాప్రతినిధులను చట్ట సభల నుంచి బహిష్కరించేవిధంగా చట్టాలు రూపొందించాలి. ఒక పార్టీపై ఎన్నికై మరో పార్టీలోకి ఫిరాయించే ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు వేయడానికి స్పీకర్‌కు నిర్ణీత వ్యవధి నిర్ణయించాలి. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ ఇచ్చే రూలింగ్‌లను సమీక్షించి నిర్ణీత గడువులో నిర్దేశించే అధికారం స్వతంత్ర సంస్థ చేపట్టే విధంగా చట్టాల్లో మార్పులు చేయాలి. ఎన్నో గురుతరమైన బాధ్యతలు కలిగిన ఎన్నికల కమిషన్‌పై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఏర్పడినప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం బలోపేతమవుతుంది.

## పటిష్టమైన చట్టాలు - భూవిధానం

ప్రభుత్వం అనుసరించే ఏ విధానానికైనా, అమలు చేసే చట్టానికైనా స్పష్టమైన ప్రజాప్రయోజనం లక్ష్యంగా ఉండాలి. ఆ క్రమంలో అమలులో ఉన్న చట్టాలను ఎప్పటికప్పుడు సమీక్షించి ప్రజల అవసరాలకు తగినట్లుగా ఆధునీకరించుకోవడం అనివార్యం. కాలం చెల్లిన చట్టాలను సంస్కరించాలి. కొన్ని సన్‌సెట్ చట్టాలు (కాలపరిమితి గల చట్టాలు) ఉండాలి. భూమిని ఉత్పత్తి చేసే అవకాశం లేదు కనుక అందుబాటులో ఉన్న భూమిని ప్రభుత్వాలు హేతుబద్ధంగా ఉపయోగించు కోవాల్సిన అవసరం ఉంది. భూమి ఉపయోగానికి సంబంధించి కొన్ని చట్టాలను పరిశీలించి నట్లయితే.. వాటిని మరింత పటిష్టవంతంగా ప్రజలకు ఉపయోగపడేదిగా రూపొందిం చాల్సిన అవసరం కనపడుతుంది. ముఖ్యంగా..ల్యాండ్ యుటిలైజేషన్ పాలసీని సమీక్షించి సామాన్యులకు, పేదలకు లబ్ది చేకూరేవిధంగా మార్పులు చేయాలి. అటవీ చట్టాలను కూడా ప్రజలకు ఉపయోగపడేవిధంగా తగిన సవరణలు చేయాల్సి ఉంది. చట్టాలలోని లోపాలను, లొసుగులను ఏ ఒక్కరూ తమకు అనుకూలంగా మార్చుకొనే పరిస్థితి ఉండరాదు.

**ఈర్ష్యతో మనిషి విచక్షణా శక్తిని కోల్పోతాడు**
**-డి.జి**

## విద్యా వ్యవస్థ

స్వాతంత్ర్యానికి పూర్వమే దేశంలో ప్రవేశపెట్టిన మెకాలే విద్యావిధానాన్నే కొద్దిపాటి మార్పులతో ఇప్పటికీ అమలు చేస్తున్నారే తప్ప.. ఎప్పటికప్పుడు మారుతున్న అవసరాలకనుగుణంగా విద్యారంగాన్ని తీర్చిదిద్దుకోలేకపోయారు. పైగా, విద్యాబోధనను మానసిక వికాసం కలిగేవిధంగా కాకుండా, నాలుగు గోడలకు పరిమితం చేసి విద్యార్థులను యంత్రాలుగా మారుస్తున్నారు. విద్యావిధానాన్ని ఎప్పటికప్పుడు మారుతున్న అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం లేదు. కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడేవిధంగా విద్యావ్యవస్థ లేదు. మన విద్యావ్యవస్థను పరికించి చూసినట్లయితే.. భావిభారత పౌరులు 4 రకాలుగా, మరో చాతుర్వర్ణ వ్యవస్థగా తయారవుతున్నారు. **1) కార్పొరేట్ విద్య అభ్యసిస్తున్న వారు. 2) ప్రైవేటు విద్యను అభ్యసిస్తున్న వారు. 3) అరకొర వసతులు కలిగిన ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకున్న వారు. 4) పాఠశాల ముఖమే చూడని వారు.** ఈ విధంగా 4 రకాలుగా రూపొందే విద్యార్థులకు సమాన అవకాశాలు ఏవిధంగా లభిస్తాయి?

ప్రస్తుతం ప్రైవేటు విద్యా కేంద్రాలు.. అవి స్కూల్ స్థాయి నుండి ఇంజనీరింగ్, మెడికల్ తదితర ఉన్నత విద్యా సంస్థలు 'బ్లాక్‌మనీ బ్రీడింగ్ కేంద్రాలు'గా పరిఢవిల్లుతున్నాయి. ఈ ప్రైవేటు విద్యా సంస్థల్ని నిర్వహిస్తున్న కొందరు వ్యక్తులు.. వందల కోట్ల రూపాయల బ్లాక్‌మనీ పోగేసి రాజకీయాల్లోకి చేరి.. ఆ డబ్బును అక్రమ మార్గాలకు ఉపయోగించి ప్రజాప్రతినిధులు, మంత్రులు అవుతున్నారు. వారే సిండికేటుగా మారి విద్యారంగాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొంటున్నారు. అంటే, ఎవరైతే వ్యవస్థలో లోపాల్ని తొలగించేందుకు పటిష్టమైన చట్టాలు రూపొందించాలో.. పైవారే చట్టాల రూపకర్తలుగా తయారు కావడం ఓ రాజకీయ విచిత్రం. ఈ పరిస్థితి మారాలి. ప్రాథమిక స్థాయి వరకు విద్యను ప్రభుత్వమే అందించగలిగితే దానివల్ల అనేక సామాజిక సమస్యలు పరిష్కారం అవుతాయి. కుల,మత,వర్గ రహితంగా విద్యార్థుల మధ్య పరస్పర స్నేహాభిమానాలు, అవగాహన, సమానత్వం ఏర్పడతాయి. ప్రాథమిక స్థాయి తర్వాత విద్యను ప్రభుత్వంతోపాటు ప్రైవేటు రంగానికి భాగస్వామ్యం కల్పించాలనుకొంటే, సేవాభావం కలిగిన సంస్థల ద్వారానే ప్రైవేటు విద్యను ప్రోత్సహించాలి. డబ్బులేని వారు

> విద్యతోనే ఉన్నత స్థానం సాధ్యం
> – డా. సర్వేపల్లి రాధాకృష్ణ

విద్యకు దూరం కాకూడదు. విద్యావంతులే దేశ సంపదను పెంచే చోదక శక్తులని గుర్తించి అందరికీ విద్యను అందుబాటులోకి తెస్తే మన మానవ వనరుల శక్తి ద్విగుణీకృతం అవుతుంది. అనేక రంగాలలో భారతీయులు వినూత్న ఆవిష్కరణలకు అంకురార్పణ చేయగలుగుతారు. ఈ రోజు ప్రపంచంలో అనేక మార్పులు వస్తున్నాయి. సమాచార సాంకేతిక రంగంతోపాటు సైన్స్ బహుముఖాలుగా విస్తరిస్తూ.. అనేక అవకాశాలు కల్పిస్తోంది. వీటిని.. అన్ని వర్గాల ప్రజలు అందిపుచ్చుకొనే చర్యలు, విధానాలు రావాలి. చేతి, కుల వృత్తులను కూడా విద్యగానే పరిగణించాలి. ఈ వృత్తులపై ఆధాపడిన వారికి ఎప్పటికప్పుడు ఆయా వృత్తుల్లో నైపుణ్యాలను పెంచడం, ఆధునిక పనిముట్లు సమకూర్చడం, మార్కెట్ సదుపాయాలను అందించడం వంటి చర్యలతో గ్రామీణ వ్యవస్థ అభివృద్ధికి దోహదం చేయాలి. గ్రామీణ యువత, వృత్తిదారుల శక్తి సామర్థ్యాలను సమాజాభివృద్ధికి ఉపయోగించు కోవాలి.

## వైద్య రంగం

నాణ్యమైన వైద్యం సామాన్యుడికి అందుబాటులో లేకపోవడం అన్నది ఓ చేదు వాస్తవం. ప్రభుత్వరంగంలోని వైద్య సేవలు అరకొరగా ఉండటం వల్ల.. సామాన్యులు అనివార్యంగా ఖరీదైన ప్రైవేటు వైద్యసేవలు పొందుతూ ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మందులు లేక, రోగ నిర్ధారణ పరికరాలు లేక, రోగులపట్ల శ్రద్ధ చూపే వైద్యులు లేకపోవడం వల్ల.. పేద, మధ్య తరగతి వర్గాల వారు అనేక ఇబ్బందులు పడుతున్న దుస్థితి సర్వత్రా ఉంది.వైద్య ఖర్చులు భరించలేక చాలామంది వైద్యశాలలకే వెళ్లడం లేదు. చిన్నచిన్న జబ్బులతోనే ఎంతోమంది అభాగ్యులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యరంగాన్ని పునర్వ్యవస్థీకరించి ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించే విధానాన్ని ప్రభుత్వాలు రూపొందించాలి. వైద్య బీమా సౌకర్యం ప్రతి సామాన్యుడికి అందించాలి.

రాష్ట్ర బడ్జెట్‌లో సముచితమైన రీతిలో వైద్య రంగానికి నిధులు కేటాయించాలి. గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలలో వైద్య సదుపాయాలు, మందులు అందుబాటులోకి తీసుకురావాలి. వైద్య సేవల రంగంలో ఆదర్శప్రాయంగా నిలుస్తున్న కొన్ని దేశాలలో

**కులాన్ని బట్టికాక గుణాన్ని బట్టి మనిషిని గౌరవించాలి**
**– గౌతమ బుద్ధుడు**

అమలు జరుగుతున్న విధానాలను అధ్యయనం చేసి వాటిని అమలు చేయాల్సిన అవసరం ఉంది.

## వ్యవసాయ రంగం

జనాభాలో ఇప్పటికి 55% మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడుతున్న రంగం-వ్యవసాయమే. ప్రజలకు ఆహారం అందించే రైతాంగం పరిస్థితి గత కొన్ని దశాబ్దాలుగా దయనీయంగా ఉంది. ప్రకృతి వైపరీత్యాలతోపాటు ప్రభుత్వాల అసంబద్ధ విధానాలతో.. వ్యవసాయం గిట్టుబాటుకాని వృత్తిగా మారింది. అయినప్పటికీ.. వేరే వ్యాపకం లేక.. రైతాంగం వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారు. ప్రభుత్వాల నుండి ప్రోత్సాహంలేక అప్పులపాలై పెద్ద ఎత్తున ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వ్యవసాయాన్ని ఆధునీకరించి లాభదాయకంగా తీర్చిదిద్దడానికి వ్యవసాయరంగంలో ప్రభుత్వాల పెట్టుబడులు పెరగాలి. సమగ్ర ప్రణాళికతో రైతులకు సకాలంలో కావల్సిన ఇన్‌పుట్స్‌ను అందిస్తూ.. వారు పండించే ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు అందించాలి. మార్కెటింగ్ సదుపాయాలు విస్తరించాలి. కౌలుదారుల ప్రయోజనాలను కాపాడాలి. వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలను, ఫుడ్ ప్రాసెసింగ్ కర్మాగారాలను ఎక్కడికక్కడ నెలకొల్పి.. రైతులకు నష్టాలు రాకుండా చొరవ చూపాలి. అందుబాటులో ఉన్న సాగునీటి వనరుల్ని సద్వినియోగపర్చుకొని వాటిని వ్యవసాయానికి ఉపయోగించు కోవడానికి సమగ్ర ప్రణాళికను అమలు చేయాలి.

## స్థానిక ప్రభుత్వాలు - సహకార రంగం

అభివృద్ధికి మూలం వికేంద్రీకరణ. ఎక్కడైతే స్థానిక ప్రభుత్వాలు సమర్థవంతంగా పనిచేస్తాయో 80% సమస్యలు స్థానికంగానే పరిష్కారం అవుతాయి. ప్రజల భాగస్వామ్యంతో పనిచేసే స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగబద్ధంగా అందించాల్సిన విధులు, నిధులు బదలాయించినట్లయితే మంచి ఫలితాలు అందుతాయి. గ్రామీణ ప్రాంతంలో సమర్థవంతమైన నాయకత్వం బయటకొస్తుంది. మొత్తంగా సమాజంలో అద్భుతమైన మార్పులు జరుగుతాయి. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ప్రత్యామ్నాయంగా

**ఏదైనా పని సాధ్యమయ్యేంత వరకు అసాధ్యంగానే అనిపిస్తుంది**
**- నెల్సన్ మండేలా**

ఏర్పాటైన సహకారరంగం రాజకీయాల కారణంగా ఆచరణలో ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. సహకార రంగ స్ఫూర్తికి అనుగుణంగా సహకార సంఘాలు నడవాలంటే.. వీటిల్లో ప్రభుత్వ జోక్యం తొలగిపోవాలి. స్వయం ప్రతిపత్తితో సహకారరంగం పనిచేసే పరిస్థితులను కల్పించాలి. బలమైన సహకార వ్యవస్థతో గ్రామీణ ప్రాంతాల్లో అసాధారణమైన ఫలితాలు రాబట్టవచ్చు. సహకారరంగాన్ని పటిష్టవంతం చేయడానికి.. నిపుణులు ఇచ్చిన నివేదికలను అమలు చేయాలి.

## రిజర్వేషన్లు

భారతదేశంలో తరతరాలుగా సంప్రదాయాల పేరుతో కొన్ని వర్గాల ప్రజలను విద్యకు, వనరులకు దూరం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రజల మధ్య పెరిగిపోయిన ఆర్థిక, సామాజిక అంతరాలను తొలగించి అందరికీ సమాన అవకాశాలు అందించే ఉద్దేశంతో ఈ వర్గాల ప్రజలకు కొన్ని ప్రత్యేక రాయితీలు కల్పించడంలో భాగంగా రాజ్యాంగంలో రిజర్వేషన్లను పొందుపర్చడం జరిగింది. ఈ రిజర్వేషన్లను 10 ఏళ్లపాటు అమలు చేయాలని నిర్దేశించడం జరిగింది. కానీ, స్వాతంత్ర్యం లభించిన 7 దశాబ్దాల తర్వాత కూడా రిజర్వేషన్లు పొడిగిస్తున్నా.. వాటిని పొందుతున్న వారి జీవన ప్రమాణాలు చెప్పుకోదగ్గ స్థాయిలో పెరగకపోగా.. రిజర్వేషన్లు ఓట్లు రాల్చే అంశంగా మారిపోయింది. ప్రస్తుతం ప్రతి సామాజిక వర్గం తమకు రిజర్వేషన్లు కావాలంటూ రోడ్లెక్కె దుస్థితి ఏర్పడిందంటే.. దేశం ఏ దిశగా పయనిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. అర్హులకు మాత్రమే రిజర్వేషన్ల ఫలాలు అందాలి.

## మద్యాన్ని ఆదాయ వనరుగా పరిగణించరాదు

దేశంలో సంపూర్ణ మద్యపాన నిషేదం రావాలన్నది మన రాజ్యాంగ లక్ష్యం. మద్యం, మత్తు పదార్థాలు, జూదం వంటి వాటిని ఆదాయవనరులుగా పరిగణించరాదని రాజ్యాంగం స్పష్టంగా పేర్కొంది. కానీ, అందుకు విరుద్ధంగా వరుస ప్రభుత్వాలు ప్రజలను మద్యానికి, జూదానికి బానిసలుగా చేసే విధానాలను అమలు చేసి ఆదాయాన్ని పెంచుకుంటున్నాయి. మద్యం కారణంగా అనేక అనర్థాలు

**ధనం నిజమైన శక్తి కాదు. మంచితనం, పవిత్రతలే నిజమైన శక్తి**
**– స్వామి వివేకానంద**

జరుగుతున్నాయి. విలువైన మానవ వనరులు వ్యర్థంగా మారుతున్నాయి. యువత మద్యానికి, మత్తుపదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. ఏ పని చేయకుండా ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. పైగా, వీటివల్ల గృహహింస, మహిళలపై దాడులు, సామాజిక నేరాలు మొదలైనవి పెరుగుతున్నాయి. ఈ పరిస్థితులు మారాలి. మద్యాన్ని ఆదాయ వనరుగా చూసే విధానాన్ని మార్చాలి. మద్యం నియంత్రణను కఠినంగా అమలు చేయాలి.

## పాలక వర్గాలుగా కొన్ని కులాలు మారరాదు

ఏ దేశంలో కూడా లేనివిధంగా వేల సంవత్సరాలపాటు భారతదేశంలో బలంగా వేళ్లూనుకొనిపోయిన 'కులవ్యవస్థ' వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఆధిపత్య కులాల వారు భారతీయ జీవన వ్యవస్థను కుల వ్యవస్థగా మార్చారు. సమాజాన్ని కులాల దొంతర్లగా వర్గీకరణ చేసి అట్టడుగు కులాల వారి జీవితాలను దుర్భరప్రాయం చేశారు. పాతుకుపోయిన దుష్టసంప్రదాయాలను ఓ మిషగా చూపించి విద్యతోసహా అనేక కీలకరంగాల్లో బడుగు, బలహీన వర్గాల ప్రజలు భాగస్వాములు కాకుండా చేయడం వల్ల దేశం తీవ్రంగా నష్టపోయింది. అనాదిగా కొన్ని వర్గాల ప్రజలు వ్యవసాయంతోపాటు అనుబంధ వృత్తులను జీవనోపాధిగా ఎంచుకున్నారు. నిజానికి, చేతి వృత్తులు కూడా నైపుణ్యవిద్యలే. కానీ వీటికి గౌరవం దక్కలేదు.

చేతి వృత్తులను, ఉత్పత్తిదారులను గౌరవించకుండా, గుర్తింపునివ్వకుండా వారిని కులపరంగా వివక్షకు గురిచేశారు. చివరకు.. క్రింది కులాల వారు తమ అభిప్రాయాలను వెలిబుచ్చే హక్కు, తమకు ఇష్టమైన వృత్తులను, దారులను అనుసరించే హక్కులను కాలరాశారు. కొన్ని కులాలే గొప్పవని వారే కొన్ని పనులు చేయాలని, కొన్ని కులాలు తక్కువని.. ఆ కులాల్లో పుట్టినవారు సేవకులుగానే ఉండాలన్న భావన అందరి మనసులలో గూడుకట్టుకొనేలా బలవంతంగా రుద్దారు. మనిషి మనిషికే పుడతాడు తప్ప కులానికి పుట్టడని.. కులం కంటే గుణం ముఖ్యమన్న కొంతమంది సంఘ సంస్కర్తల వాదన చెల్లుబాటు కాలేదు. ఆ క్రమంలోనే.. దేశంలో అనేక కులాలు ఉన్నప్పటికీ..

**కుల మతాలకు అతీతంగా మనిషి మనిషిగా ఎదగాలి**
**–డి.జి**

కొన్ని కులాలు మాత్రమే సమాజాన్ని శాసించే స్థాయికి ఎదగగలిగాయి. ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకు విరుద్ధంగా **కొన్ని కులాలు డబ్బుతో రాజకీయ వ్యవస్థపై పట్టుసాధించి పాలక వర్గాలుగా మారాయి.** తమకు మాత్రమే అధికారం చేపట్టే హక్కు ఉన్నట్లు, పరిపాలించే సామర్థ్యం ఉన్నట్లు ప్రజలను భ్రమలకు లోను చేస్తున్నాయి. అధికారం అన్నది ఎవరి గుత్తసొత్తూ కాదు. మెజారిటీ వర్గాలకు అధికారంలో దామాషా ప్రకారం భాగస్వామ్యం లభిస్తే సమాజంలో చైతన్యం వెల్లివిరుస్తుంది. కొన్ని కులాల్లో గూడుకట్టుకొనిపోయిన ఆధిపత్య భావన సమసి పోతుంది. అదేవిధంగా.. వృత్తిదారులకు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆధునిక పనిముట్లను అందించాలి. సంప్రదాయ కులవృత్తులలో ఉన్నవారికి ప్రభుత్వపరమైన ప్రోత్సాహకాలు అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలి.

## మహిళలకు అన్నింటా భాగస్వామ్యం

అపారమైన శక్తిసామర్థ్యాలు కలిగిన మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించిన దేశాలు అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాయి. కానీ, ఇక్కడ మాత్రం జనాభాలో సగ భాగమైన మహిళలను కట్టుబాట్లు, ఆచారాల పేరుతో అన్ని రంగాలకూ దూరంగా పెట్టి అన్యాయం చేశారు, అణగదొక్కారు. మహిళల భాగస్వామ్యం లేకుండా భారత్ అగ్రస్థానం చేరుకోలేదు. అదేవిధంగా.. అనేక శతాబ్దాలుగా కట్టుబాట్లు, ఆచారాల పేరుతో మహిళలను కొన్ని అవకాశాలకే పరిమితం చేసిన పరిస్థితిని తొలగించాలి. వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి. మహిళలు తమ దైనందిన జీవితంలో తమకు అనువైన విధానంలో వస్త్రధారణ చేసుకోగలిగిన స్వేచ్ఛ ఉండాలి. ఏ ఆచారమూ వారి అభివృద్ధికి అవరోధంగా ఉండరాదు. మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలి. మహిళా సాధికారత కొరకు సమాజం సంపూర్ణంగా కృషి చేయాలి.

## మతం

మతం ప్రజల విశ్వాసం. మానవ పరిణామ క్రమంలో మనిషిని అత్యంత ప్రభావితం చేసింది మతమే. ప్రతి మతం బోధనల్లో కన్పించేది – మానవత్వం.

**స్త్రీ పురుషులనే వివక్ష ఏ రంగంలోనూ ఉండరాదు**
**–డి.జి**

సంఘజీవి అయిన మనిషి – తనతోటి వారితో కలిసిమెలసి సహనంతో, సామరస్యంతో, ప్రేమతో మెలగాలని అన్ని మతాలు బోధిస్తున్నాయి. అక్కడి పరిసరాలు, పరిస్థితులను అనుసరించి మతాల ఆచారాలు ఏర్పడ్డాయి. దైవసృష్టి అయిన ప్రకృతిలో వివిధ ప్రాంతాలలో శీతలం, వేడిమి, అధిక వర్షపాతం.. ఇలా వైవిధ్యభరితమైన వాతావరణ పరిస్థితులతో పాటు ఎడారి ప్రాంతాలు, జీవనదులు, పర్వతాలు, సముద్రాలు ఇలా అనేక ప్రాంతాలు సహజంగా ఏర్పడి ఉన్నాయి. ఆయా నైసర్గిక, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రజలు దుస్తులు ధరించటం, ఆహారపు అలవాట్లు, సాంస్కృతిక జీవన విధానాన్ని అవలంభిస్తున్నారు. దీనిని అర్థం చేసుకోవాలి. గౌరవించాలి. అయితే మానవ అభివృద్ధి కోసం ఏర్పడ్డ మతాలను కొందరు స్వార్థంతో మత ధర్మాలను వక్రీకరించి మానవాభివృద్ధికి ఆటంకాలుగా మార్చారు. మతాన్ని తమ రాజ్యకాంక్షకు వాడుకొన్నారు. చరిత్రలో జరిగిన అనేక యుద్ధాలు ఈ క్రమంలోనే జరిగాయి. మతం ఎప్పుడూ ప్రజాబాహుళ్యం మంచినే కాంక్షిస్తుంది. కానీ, మతం సూత్రాలను కొందరు తప్పుగా అన్వయిస్తూ.. ప్రజల మధ్య విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. అభివృద్ధికి ఆటంకంగా మారుస్తున్నారు. ఈ పరిస్థితులు మారాలి. మతాన్ని మానవ వికాసానికే ఉపయోగించాలి. జీవన విధానాన్ని క్రమబద్ధీకరించి, ఆధ్యాత్మిక భావనలు పెంచే సాధనంగా మతాన్ని చూడాలి. సర్వమత సంస్కృతి సమాజంలో వెల్లివిరిస్తేనే శాంతి, సామరస్యం, అభివృద్ధి సాధ్యం. ఆ దిశగా ప్రభుత్వాలు, ధార్మిక సంస్థలు, మత పెద్దలు కృషి చేయాలి.

## రాజ్యాంగం సరైన దిశలో అమలు జరగాలి

దేశాన్ని పట్టిపీడిస్తున్న అన్ని రుగ్మతలకు పరిష్కారం రాజ్యాంగం ద్వారానే చేకూరదు. నిజానికి అటువంటి భావనలను స్వయంగా డా॥ అంబేద్కర్ పటాపంచలు చేశారు. **"రాజ్యాంగం ఎంత మంచిదైనాకావొచ్చు.. దానిని అమలు జరిపేవారు చెడ్డవారైతే అదీ చెడ్డదవుతుంది. మంచి వారైతే అదీ మంచిదవుతుంది"** అని కుండ బద్దలు కొట్టినట్లు స్పష్టం చేశారు. రాజ్యాంగంలో ఏర్పరిచిన నిబంధనలు, హక్కులు, ఆదేశిక సూత్రాలతోపాటు, పాలకుల స్వీయ నైతిక ప్రవర్తనే దేశ భవిష్యత్తును

**మతాలు, వాటి ఆచారాలు సమాజాభివృద్ధికి తోడ్పడాలి,**
**వికాసానికి అడ్డంకి కారాదు – డి.జి**

నిర్దేశిస్తుందని అంబేద్కర్ పరోక్షంగా చెప్పారు.

## భవిష్యత్తు ఆశాజనకం

ప్రపంచ జనాభాలో 1/6వ వంతు ప్రజలున్న మన దేశంలో మానవ వనరులు మనకున్న విలువైన సంపద. దేశంలో అనేక సమస్యలు, లోపాలు ఉన్నప్పటికీ.. గతంలోలా నిస్సహాయతతో ఉండిపోవాల్సిన అవసరం నేడు లేదు. ఈ అనంత విశ్వంలో ప్రతి ఒక్కరూ తమదైన ప్రత్యేకతను చాటుకునే అవకాశం ఉంది. ఈ విశ్వం మనతోనే మొదలుకాలేదు.. మనతోనే అంతిమం కాబోదు. గతంలోకంటే ఇప్పుడు అవకాశాలు పెరిగాయి. అనూహ్యంగా అభివృద్ధి చెందుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెనువిప్లవాన్ని సృష్టిస్తోంది. అందరికీ పుష్కలమైన అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. సమాజం నిరంతరం పరివర్తనకు లోనవుతున్నది. అన్ని రంగాల్లో పారదర్శకత పెరిగింది. అదేవిధంగా ప్రజల సొమ్ముతో దశాబ్దాల క్రితం మొదలైన మౌలిక సదుపాయాలు ఇపుడు పూర్తిగా అందుబాటులోకి వస్తున్న ఫలితంగా ఉపాధి అవకాశాలు పెరిగి ప్రజల ఆదాయాలు మెరుగుపడుతున్నాయి. దేశంలో ఘనీభవించిన పేదరికం క్రమంగా తగ్గుతున్నది. ప్రజలు స్వేచ్ఛగా ఆలోచించడానికి, నిర్ణయాలు తీసుకోవడానికి అనువైన పరిస్థితులు మెరుగవుతున్నాయి. అయితే, పాలనా వ్యవస్థలను మెరుగుపర్చుకోవడం, ఆధునీకరించడం, ప్రయోజనాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవడం ప్రజల చేతుల్లోనే ఉంది.

రాజకీయ స్వలాభం కొరకు నేడు 'కులం'కు ఎనలేని ప్రాధాన్యత ఆపాదించడం జరుగుతున్నది. కుల ప్రాతిపదికన రాజకీయపార్టీలు ఎన్నికల్లో టిక్కెట్లు కేటాయిస్తున్నాయి. గెలుపు గుర్రాల పేరుతో అగ్రకులాలకు పెద్ద పీట వేస్తున్నాయి. సామర్థ్యాన్ని, ప్రతిభను కొలమానంగా తీసుకోవడం క్రమంగా తగ్గిపోతున్నది. మంత్రివర్గ కూర్పు, అధికారుల బదిలీలు మొదలైన ప్రతి అంశంలో కులాన్ని ప్రాతిపదికగా పరిగణిస్తున్నారు. చదువుకున్న వారిలోనే ఎక్కువగా కులజాడ్యం పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. కుల వ్యవస్థ మూలంగా మెజారిటీ సంఖ్యలో ఉన్న

**మార్పును అడ్డుకోరాదు..ఆహ్వానించాలి -డి.జి**

బలహీనవర్గాల ప్రజలు విద్య, వనరులకు దూరం చేయబడ్డారు. అందువల్ల కుల, మతాలకు అతీతంగా ప్రతిభను ప్రోత్సహించాలి. ప్రజాస్వామ్యం కుల స్వామ్యంగా మార్చడానికి జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలి. కులానికి ప్రాధాన్యత తగ్గాలి. ఈనాడు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక విప్లవం ప్రపంచాన్ని ఓ కుగ్రామంగా మార్చింది. ఎన్నో వందల సంవత్సరాల క్రితం భరత ఖండాన్ని జంబూద్వీపం అనే పరిధిని గీసి దానినే ప్రపంచంగా చూపిస్తూ.. మెజారిటీ ప్రజలను చదువును దూరం చేసి కొందరు ఆధిపత్యం చెలాయించారు. దానివల్ల ఎంతో నష్టం జరిగింది. అయితే, సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచ ఎల్లలు చెరిపేసిన నేపథ్యంలో.. అవకాశాల కోసం అన్ని దేశాలు పోటీపడే పరిస్థితి ఉత్పన్నమైంది. ఈ పోటీలో మన దేశానికి మెరుగైన అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే ఈ దేశానికి ఉన్న అతిపెద్ద ఆస్తి యువత. వారి నైపుణ్యాలను మెరుగుపర్చి తగిన ప్రోత్సాహం అందించగలిగితే దేశం అభివృద్ధిపథంలోకి వేగంగా దూసుకుపోగలుగుతుంది. భౌగోళిక పరిస్థితులను బట్టి ప్రకృతి ఒక్కోప్రాంతంలో ఒక్కోరకంగా ఉంటుంది. కనుక, మతాచారాలను ప్రకృతి ధర్మాలకు అనుగుణంగా ఆచరించుకునే స్వేచ్ఛను ప్రజలకు కల్పించాలి. అత్యంత విలువైన ప్రకృతి సహజ వనరులైన.. సూర్యరశ్మి, నీరు, గాలిని ప్రస్తుత అవసరాలకు వినియోగించుకుంటూ భవిష్యత్తు తరాల అవసరాలకు అందించే విధంగా వాటిని వృధా చేయకుండా సంరక్షించుకోవాలి.

మార్పు ఒక వాస్తవం. దానిని ఆహ్వానించాలి. నిరంతరం మార్పునకు లోనయ్యే సమాజంలో 'మార్పు'ను అడ్డుకోరాదు. దానికి అనుగుణంగా నడుచుకోవాలి. ప్రజలు సహనాన్ని, ఓర్పును, కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలి. తమ జీవన విధానాన్ని ప్రజస్వామ్యయుతంగా, రాజ్యాంగబద్ధంగా మలుచుకోవాలి. ప్రజల ఆలోచనాధోరణి ప్రజాస్వామ్యయుతంగా సాగే సమాజంలో ప్రజాస్వామ్యం పరిపుష్టం అవుతుంది. సమస్యలకు పరిష్కార కర్తలు మరెవరోకాదు.. ప్రజలే! రాజ్యాంగం సరియైన దిశలో అమలు జరగాలి. రాజ్యాంగాన్ని సరియైన దిశలో నడిపించే బాధ్యత ప్రజలదే. **ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులు!**

**ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజలు నిర్వహించే ప్రభుత్వమే ప్రజాస్వామ్యం - అబ్రహం లింకన్**

భారతీయుల ఘన చరిత్ర, స్వతంత్ర భావన, స్వపరిపాలనా కాంక్షకు ప్రతీక అయిన 'భారత రాజ్యాంగం' రూపుదిద్దుకునే క్రమంలో అనేక చారిత్రక ఘట్టాలు ఉన్నాయి. రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు మొదలుకొని రాజ్యాంగ రచనా బాధ్యతలను డా॥ బి.ఆర్.అంబేద్కర్ నేతృత్వంలోని కమిటీ బాధ్యతలు స్వీకరించడం, రాజ్యాంగ రచనలో వివిధ అంశాలను పొందుపర్చడం.. ముఖ్యంగా రాజ్యాంగాన్ని పీఠిక, ఆదేశిక సూత్రాల ప్రాధాన్యత.. ప్రాథమిక హక్కులు, వివిధ షెడ్యూళ్లు ఇలా అనేక అంశాలకు సంబంధించిన వివరాలు ఉన్నాయి. 'భారత రాజ్యాంగం' ఆమోదం పొందిన వరకు సాగిన చరిత్రను క్లుప్తంగా ఇవ్వడం జరిగింది.

# భారత రాజ్యాంగం రూపకల్పన చారిత్రక ఘట్టాలు

## 1935 భారత ప్రభుత్వ చట్టం

- భారతదేశానికి రాజ్యాంగం ఉండాలని 1914లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు గోపాలకృష్ణ గోఖలే ప్రతిపాదించారు. తదుపరి కాలంలో రాజ్యాంగం ఏర్పడాలన్న డిమాండ్‌ను అనేక మంది నేతలు సమర్థించారు. బ్రిటీష్ పాలకులపై ఒత్తిడి తెచ్చారు.
- 1935లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభ రాజ్యాంగాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించింది.
- 1935లో 'భారత ప్రభుత్వ చట్టం' రూపుదిద్దుకుంది.

## సమాఖ్య వ్యవస్థ

- దేశంలో విజయవంతంగా నడుస్తున్న ప్రస్తుత సమాఖ్య వ్యవస్థను 1935 భారత ప్రభుత్వ చట్టం ద్వారా ప్రవేశపెట్టారు. కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలకు స్థానం కల్పించారు.

- కేంద్ర, రాష్ట్రాలలో ద్విసభలను, పబ్లిక్ సర్వీసు కమిషన్లను, వివాదాల పరిష్కారానికి సుప్రీంకోర్టును, ఆర్థిక చర్యలను నియంత్రిచండానికి రిజర్వు బ్యాంకును ప్రతిపాదించారు.

## రాజ్యాంగ పరిషత్ ఆవిర్భావం

- రాజ్యాంగం రూపకల్పనకు ముందుగా రాజ్యాంగ పరిషత్‌ను స్థాపించడానికి బ్రిటీష్ ప్రభుత్వం 1940లో అంగీకరించింది.

- భారత్‌లోని రాష్ట్రాల శాసనసభలకు తొలుత ఎన్నికలు నిర్వహించి.. తర్వాత రాజ్యాంగ పరిషత్ సభ్యులను ఎన్నుకుంటామంటూ 1945 సెప్టెంబరు 19న ఆకాశవాణి (ఆల్ ఇండియా రేడియో)లో నాటి గవర్నర్ జనరల్ లార్డ్ వేవెల్ ప్రకటనతో రాజ్యాంగ పరిషత్ ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది.

## రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలు

- క్యాబినెట్ మిషన్ ప్లాన్ ద్వారా 1946లో తొలిసారి రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలు జరిగాయి.

## ఓటర్లు ఎవరంటే..

- అప్పటికి వయోజన, సార్వత్రిక ఓటింగ్ విధానం అమలులో లేనందువల్ల భారతదేశ ప్రజలలో 10% మందికి మాత్రమే ఓటు హక్కు ఉండేది.

- వివిధ రాష్ట్రాలలో అధికారం, పలుకుబడి గల సంపన్నులే ఓటర్లుగా ఉండేవారు. వివరంగా చెప్పాలంటే.. పన్నులు కట్టగలిగిన వారు, విద్యావంతులు మాత్రమే ఓటర్లు.

- వీరిలో ఆయా మతాల జనసంఖ్యను బట్టి హిందువులు, ముస్లింలు, సిక్కులున్నారు.

- శాసనసభల ద్వారా 292 మంది, 584 సంస్థానాల నుండి 93 మంది, చీఫ్ కమిషనర్ ప్రావిన్స్‌ల ప్రతినిధులు నలుగురు సభ్యులయ్యారు. దీంతో మొత్తం సభ్యుల సంఖ్య 389కి పెరిగినా తర్వాత మౌంట్ బాటెన్ దేశ విభజన ప్రణాళికతో సభ్యుల సంఖ్య 299కి తగ్గిపోయింది.

## ఎన్నికైన వారిలో ప్రముఖ నేతలు

◆ ఎన్నికైన ప్రముఖుల్లో జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, రాజాజీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, డా॥రాజేంద్రప్రసాద్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, సరోజినీనాయుడు, ఆచార్య జేబీ కృపలానీ, మహమ్మద్ అలీ జిన్నా, బాబూ జగ్జీవన్‌రామ్, శ్యామా ప్రసాద్ ముఖర్జీ, ఎం.ఆర్.జయకర్, సర్వేపల్లి రాధాకృష్ణన్, టంగుటూరు ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డి, పట్టాభి సీతారామయ్య, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, కళావెంకట్రావు, కల్లూరు సుబ్బారావు, మోటూరు సత్యనారాయణ, ఎన్.జి.రంగా, బొబ్బిలి రామకృష్ణరంగారావు తదితరులు సభ్యులుగా ఉన్నారు.

## రాజేంద్ర ప్రసాద్ నేతృత్వం

◆ రాజ్యాంగ పరిషత్ శాశ్వత అధ్యక్షుడిగా డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా హెచ్‌సీ ముఖర్జీ, కృష్ణమాచారి, న్యాయసలహాదారుగా బి.ఎన్.రావు ఎన్నికయ్యారు.

## రాజ్యాంగ పరిషత్ న్యాయ సలహాదారు

◆ భారత రాజ్యాంగ పరిషత్‌కు న్యాయ సలహాదారుగా తొలితరం ఐసిఎస్ అధికారి బెనగళ్ నర్సింగరావు వ్యవహరించారు. ఆయన బి.ఎన్.రావుగా సుప్రసిద్ధులు.

## అంబేద్కర్ సారథ్యం

◆ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం 1947 ఆగస్టు 29న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో రాజ్యాంగ రచనా కమిటీ ఏర్పాటైంది.

## బి.ఆర్.అంబేద్కర్ ఎంపిక ఎలా జరిగిందంటే..

◆ మహారాష్ట్రకి చెందిన డా॥ బి.ఆర్.అంబేద్కర్ బెంగాల్ శాసనసభలోని ఎస్సీ ఫెడరేషన్ సభ్యులు, ముస్లిం లీగ్ మద్దతుతో సభ్యునిగా ఎంపికయ్యారు.

◆ 1946, జూన్ 29న బ్రిటీష్ పాలకులు ఇండియాకి ఒక తాత్కాలిక ప్రభుత్వాన్ని నియమించనున్నట్లు ప్రకటించారు.

◆ ఆగస్టు 24న ఆ మంత్రి వర్గంలోని పేర్లను ప్రకటించారు కానీ ఆ జాబితాలో అంబేద్కర్ పేరు లేదు.

◆ కాంగ్రెస్ వారు జగ్జీవన్ రామ్‌ని మంత్రిగా ప్రకటించారు.

◆ బ్రిటీష్ వారు ప్రకటించిన ఈ లిస్టుని ఆమోదించవద్దని ఎస్సీ ఫెడరేషన్ జగ్జీవన్ రామ్‌కి విజ్ఞప్తి చేసింది. ఆయన మన్నించలేదు.

◆ అంబేద్కర్ లండన్ వెళ్లి దళితులకు అన్యాయం జరిగిందని చెప్పారు. ఇంతలో 1947 ఆగస్టు వచ్చింది. దానితోపాటు దేశ విభజన, పాకిస్థాన్ ఏర్పాటు జరిగాయి.

◆ ఈ క్రమంలో అంబేద్కర్ ఎన్నికైన బెంగాల్ స్థానం తూర్పు పాకిస్థాన్‌లోకి వెళ్లింది. ఆయన రాజ్యాంగ సభలో సభ్యత్వం కోల్పోయారు.

◆ ఈ చీలిక వాతావరణంలో కాంగ్రెస్ నాయకత్వం దేశ ఐక్యత కోసం అని అంబేద్కర్‌ని, హిందూ మహాసభ నాయకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీని ఆహ్వానించి కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకున్నది.

◆ ఆ క్రమంలోనే అంబేద్కర్‌ని రాజ్యాంగ సభలోకి మళ్లీ తీసుకున్నారు.

## 19 కమిటీలు

◆ రాజ్యాంగ రూపకల్పనలో భాగంగా 19 కమిటీలను నియమించారు.

◆ రాజ్యాంగ సారథ్య సంఘానికి, స్టాఫ్-ఫైనాన్స్ కమిటీకి, జాతీయ జెండా అడ్‌హాక్ కమిటీకి, నియమనిబంధనల కమిటీకి డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్, చైర్మన్‌గా ఉన్నారు.

◆ ముసాయిదా కమిటీకి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చైర్మన్.

- రాజ్యాంగ సలహా సంఘానికి, ప్రాథమిక హక్కుల కమిటీకి, అల్పసంఖ్యాక వర్గాల కమిటీకి, రాష్ట్ర రాజ్యాంగాలపై కమిటీకి సర్ధార్ వల్లభాయ్ పటేల్ చైర్మన్.
- ప్రాథమిక హక్కుల సబ్ కమిటీకి చైర్మన్ జేబీ కృపలానీ.
- కేంద్ర రాజ్యాంగ కమిటీకి, కేంద్ర అధికారాల కమిటీకి చైర్మన్ జవహర్‌లాల్ నెహ్రూ
- సుప్రీంకోర్టు సన్నాహక కమిటీకి చైర్మన్ వరదాచారి
- బిజినెస్ కమిటీకి చైర్మన్ కేఎం మున్షీ
- ఈశాన్య రాష్ట్రాల హక్కుల కమిటీకి చైర్మన్ గోపీనాథ్ బోర్డే
- హౌస్ కమిటీకి చైర్మన్ భోగరాజు పట్టాభి సీతారామయ్య
- పార్లమెంటరీ నియమనిబంధనావళి కమిటీ చైర్మన్ జీవీ మౌలాంకర్

## రాజ్యాంగ నిర్మాణానికి పట్టిన సమయం

- రాజ్యాంగ ముసాయిదాప్రతి తయారీలో భాగంగా అంబేద్కర్ స్వయంగా 60 దేశాలకు చెందిన రాజ్యాంగాలను చదివారు.
- రాజ్యాంగ నిర్మాణానికి రాజ్యాంగ సభకు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టింది.
- రాజ్యాంగ సభ 11 సార్లు, 165 రోజులపాటు సమావేశమైంది.
- రాజ్యాంగ ప్రతిరూపకల్పనకు 114 రోజులు పట్టింది.

## సవరణలు - ప్రతిపాదనలు

- రాజ్యాంగ ప్రతిరూపకల్పనలో భాగంగా 7,635 సవరణలు వచ్చాయి. 2,473 ప్రతిపాదనలు 115 రోజులపాటు చర్చించారు.

## ఆమోదం

- రాజ్యాంగాన్ని 1949, నవంబర్ 26న ఆమోదించారు.

## అమలులోకి

◆ 1950,జనవరి 26 నుండి భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది.

## విభాగాలు - షెడ్యూళ్లు - అధికరణలు

◆ రాజ్యాంగం అమలులోకి వచ్చిన సమయంలో 22 విభాగాలు, 8 షెడ్యూళ్లు, 395 అధికరణలు ఉన్నాయి.

◆ ప్రస్తుతం రాజ్యాంగంలో 25 విభాగాలు,12 షెడ్యూళ్లు,448 అధికరణలున్నాయి.

## అతి పెద్దది - లిఖిత రాజ్యాంగం

◆ ప్రపంచంలో అతిపెద్ద రాజ్యాంగం మనదే. లిఖిత రాజ్యాంగం కూడా మనదే.

## భారత రాజ్యాంగం తయారీ ఖర్చు

◆ రాజ్యాంగంలో చేర్చాల్సిన అంశాలపై అధ్యయనం చేసేందుకు సభ్యులు వివిధ దేశాల్లో పర్యటించారు. ఈ ప్రక్రియ మొత్తానికి అప్పట్లో రూ. 64లక్షల ఖర్చయింది.

## దస్తూరి

◆ రాజ్యాంగ అసలు ప్రతిని ఆంగ్లంలో ప్రేమ్‌బెహారీ నారాయణ్ రైజదా అందమైన దస్తూరీలో ఇటాలిక్ ఫాంట్‌లో రాశారు. ఎలాంటి పారితోషికం తీసుకోలేదు. అందుకు బదులుగా ప్రతి పేజీలో తన పేరు, మొదటి పేజీలో తనతోపాటు తన తాత పేరు రాసుకోవడానికి అనుమతి కోరారు.

## తొలి ప్రతి

◆ రాజ్యాంగం తొలిప్రతిని డెహ్రాడూన్‌లో ప్రచురించగా.. ఫోటోలను 'సర్వే ఆఫ్ ఇండియా' సమకూర్చింది.

## ఎంత మంది సంతకాలు చేశారంటే?

- హిందీ, ఆంగ్లంలో తయారైన రెండు రాజ్యాంగ ప్రతులపై రాజ్యాంగ పరిషత్‌లోని 299 మంది సభ్యుల్లో 284 మంది సంతకాలు చేశారు. మిగిలిన 15 మందిలో ఒకరు మృతి చెందగా, మరొకరిని తొలగించారు. 13 మంది తుది భేటీకి రాలేదు.

## రాజ్యాంగానికి సంబంధించి కొన్ని ఆసక్తికర అంశాలు

- రాజ్యాంగం ఆంగ్ల ప్రతిలో మొత్తం 1,17,369 పదాలున్నాయి.
- రాజ్యాంగ నిర్మాణానికి ఎన్నుకున్న రాజ్యాంగ పరిషత్ సభ్యుల్లో జాతిపిత మహాత్మాగాంధీ లేరు.
- భారత రాజ్యాంగ పరిషత్ చిహ్నం ఏనుగు (ఐరావతం). దీనినే తర్వాత మన దేశ వారసత్వ జంతువుగా గుర్తించారు.
- రాజ్యాంగం హిందీ, ఆంగ్లం మూల ప్రతులను పార్లమెంటు గ్రంథాలయంలో హీలియంతో నింపిన పెట్టెలో భద్రపరిచారు. హీలియం వాయువు ఇతర పదార్థాలతో రసాయన చర్యలకు గురవదు. దాంతో అందులో భద్రపరిచిన వస్తువులు ఎన్నిరోజులైనా పాడవకుండా కొత్తవాటిలాగే ఉంటాయి.

## జాతీయ జెండా రూపకల్పన

- భారతదేశ జాతీయ జెండాలో మూడు వర్ణాలు – కాషాయం, తెలుపు, ఆకుపచ్చ ఉండి మధ్యలో అశోక చక్రం చిహ్నం ఉంటుంది.
- గాంధీజీ సూచనపై దీనిని రూపకల్పన చేసినవారు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు 'పింగళి వెంకయ్య'.
- ఇప్పుడున్న మువన్నెల జెండాను 22 జూలై, 1947న రాజ్యాంగ పరిషత్ సమావేశం సందర్భంలో స్వీకరించడం జరిగింది.
- జనవరి 26, 1950న భారతదేశం గణతంత్ర రాజ్యంగా అవతరించిన నాటి నుంచి దేశానికి ఇది జాతీయ జెండాగా మారింది.

# THE CONSTITUTION OF INDIA

Preamble

**WE, THE PEOPLE OF INDIA,** having solemnly resolved to constitute India into a **SOVEREIGN DEMOCRATIC REPUBLIC** and to secure to all its citizens:

**JUSTICE,** social, economic and political;

**LIBERTY** of thought, expression, belief, faith and worship;

**EQUALITY** of status and of opportunity;

and to promote among them all

**FRATERNITY** assuring the dignity of the individual and the unity of the Nation;

**IN OUR CONSTITUENT ASSEMBLY** this twenty-sixth day of November, 1949, do **HEREBY ADOPT, ENACT AND GIVE TO OURSELVES THIS CONSTITUTION.**

# భారత రాజ్యాంగం

# ప్రియాంబుల్

## రాజ్యాంగం లక్ష్యాలు - ఆదర్శాలకు ప్రతిబింబం ప్రియాంబుల్

ప్రజలే రాజ్యాంగ నిర్మాతలు. అధికారానికి వారే మూలం అనే విషయాల్ని భారత రాజ్యాంగ ప్రవేశిక (ప్రియాంబుల్) ప్రస్ఫుటీకరిస్తోంది. భారత దేశాన్ని ఎలా నిర్మించాలనుకుంటున్నది? ప్రజలకు కల్పించే హక్కుల విషయాల్ని ఇది విశదీకరిస్తోంది. రాజ్యాంగ నిర్మాణ లక్ష్యాలు, ఆశయాలు పేరుతో రాజ్యాంగ పరిషత్తు తొలి సమావేశాల్లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన తీర్మానంలోని అంశాలు ప్రవేశిక రచనకు దిక్సూచిగా పనిచేశాయని చెబుతారు. మొత్తంగా భారత రాజ్యాంగం మౌలిక స్వభావానికి ప్రవేశిక దర్పణం పడుతుంది.

## ప్రియాంబుల్

భారతదేశ ప్రజలమైన మేము 1949 నవంబర్ 26న

భారత రాజ్యాంగాన్ని మాకు మేమే సమర్పించుకున్నాం.

దేశాన్ని సర్వసత్తాక (సర్వాభౌమాధికార),

సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గతతంత్ర రాజ్యంగా ప్రకటిస్తున్నాం.

## లక్ష్యాలు..

- దేశ పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక,రాజకీయ న్యాయాన్ని అందించడం.
- ఆలోచన, భావ ప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలో స్వేచ్ఛ
- సమాన హోదా, సమాన అవకాశాలు కల్పించడం
- ప్రజల్లో వ్యక్తి గౌరవం, దేశ సమైక్యత, సమగ్రత భావాల పెంపు

## ప్రియాంబుల్‌లో పేర్కొన్న పదాలు.. వాటి భావాలు

- **సర్వసత్తాక (సావర్నిటీ)**: మన దేశం సర్వస్వతంత్రమైంది. సార్వభౌమాధికారం కలిగినది. దానిపై ఏ విదేశీ శక్తికి అధికారం లేదు. వివిధ అంతర్జాతీయ సంస్థలలో, దేశాల కూటములలో సభ్యత్వం కలిగి ఉన్నప్పటికీ.. వాటి ఆధిపత్యం మనపై ఉండదు.

- **సామ్యవాద (సోషలిస్ట్)** : ఆర్థిక న్యాయాన్ని, సమానత్వాన్ని సాధించడం, వనరులను సామాజిక ప్రయోజనాలకు వినియోగించేటట్లు చేయడం.

- **లౌకికతత్వం (సెక్యులరిజం)** : లౌకితత్వం అంటే 'మత ప్రమేయం లేని' అని అర్థం. భారత ప్రభుత్వం అన్ని మాతాలను సమానంగా చూస్తుంది.

- **గణతంత్రం (రిపబ్లిక్)** : ప్రజల లేదా ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధుల వద్ద సర్వోన్నత అధికారం ఉండటం. ప్రజలతో ఏర్పడిన ప్రభుత్వం అని అర్థం.

## భారత రాజ్యాంగం

# ఆదేశిక సూత్రాలు

- ◆ భారతదేశాన్ని ఒక సంక్షేమ, ఉత్తమ, ఆదర్శ రాజ్యంగా నిర్మించడానికి రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను చేర్చారు. వీటి అమలు ద్వారా ఆర్థిక, సాంఘిక ప్రజాస్వామ్యాన్ని సాధించాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు.
- ◆ ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా.. దాని సిద్ధాంతాలు, విధానాలకు అతీతంగా ఆదేశిక సూత్రాలను అమలు పరచాలి.
- ◆ ఈ సూత్రాలను రాజ్యాంగంలోని ఐదవ భాగంలో చేర్చారు. 36 నుంచి 51వరకు ఉన్న అధికరణలు ఆదేశిక సూత్రాల గురించి తెలియజేస్తాయి.

### ఆదేశిక సూత్రాల లక్షణాలు :

- ◆ కేంద్ర, రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలకు మార్గదర్శకంగా ఉంటాయి.
- ◆ శ్రేయోరాజ్యస్థాపన వీటి ఉద్దేశం.
- ◆ ఇవి ఆర్థిక, సాంఘిక సమానత్వ సాధనకు తోడ్పడతాయి.
- ◆ న్యాయ స్థానాల ద్వారా వీటికి రక్షణ లేదు.
- ◆ ఈ సూత్రాలు స్వయంగా అమల్లోకి రావు.

### నిబంధన 38

- ◆ భారతదేశం ఒక సంక్షేమ రాజ్యం. దీని సాధన కోసం ఆర్థిక, సాంఘిక, రాజకీయ న్యాయాన్ని అందించాలి. దీంట్లో భాగంగా 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం, 1955 అంటరానితనం నిషేద చట్టం, 1976 పౌరహక్కుల చట్టం, 1961 వరకట్న నిషేద చట్టం మొదలైనవాటిని రూపొందించారు.

## నిబంధన 39

- భౌతిక సంపదను అందరికీ సమానంగా పంపిణీ చేయాలి. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని సంపదను వినియోగించుకోవాలి. స్త్రీ, పురుషులకు సమాన జీతభత్యాలను చెల్లించాలి. సంపద వికేంద్రీకరణ కోసం 1950లో ప్రణాళిక సంఘాన్ని ఏర్పాటు చేశారు. 1951లో భూసంస్కరణల చట్టాన్ని రూపొందించారు.

## నిబంధన 39(ఎ)

- వికలాంగులు, పేదవారికి ఉచితన్యాయ సలహా అందించాలి. దీనికోసం 1987లో లీగల్ సర్వీసుల చట్టాన్ని రూపొందించాలి.

## నిబంధన 40

- గ్రామ స్వరాజ్యం, గ్రామీణ సమీకృత అభివృద్ధి కోసం స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలి. 1952లో సమాజ అభివృద్ధి పథకం, 1953లో జాతీయ విస్తరణ పథకాన్ని ప్రవేశ పెట్టారు.

## నిబంధన 41

- పనిహక్కు కల్పించడానికి నిరుద్యోగ భృతి చెల్లించాలి. వికలాంగులు, వృద్ధులు, అనాథలకు చేయూతనివ్వాలి. 1987 లో వృద్ధాప్య పెన్షన్ పథకాన్ని, 2006లో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు.

## నిబంధన 42

- మహిళా సంక్షేమానికి చర్యలు చేపట్టాలి. ప్రసూతి కేంద్రాలను విస్తరించాలి. 1961లో మాతృత్వ ప్రయోజన, 2007లో పితృత్వ ప్రయోజన చట్టాలను రూపొందించారు.

## నిబంధన 43

- కుటీర పరిశ్రమలను అభివృద్ధి పరుస్తూ ఉపాధి అవకాశాలను పెంపొందించాలి. కార్మికుల మానసిక, శారీరక వికాసానికి చర్యలు చేపట్టాలి. వీటిని అభివృద్ధి పరచడానికి నేషనల్ ఖాదీ అసోసియేషన్, నేషనల్ హ్యాండ్‌లూమ్ అసోసియేషన్ లాంటివాటిని స్థాపించారు.

## నిబంధన 43(బి)

◆ సహకార సంఘాలకు రాజ్యాంగ హెూదా కల్పించారు. దీన్ని 2013లో 97వ సవరణ ద్వారా చేర్చారు.

## నిబంధన 44

◆ ఉమ్మడి పౌరస్మృతిని ఏర్పాటు చేయాలి. దీని ప్రకారం ప్రస్తుతం హిందూ, ముస్లింలకు వేర్వేరుగా ఉన్న ఫ్యామిలీ చట్టాలను రద్దు చేసి అందరికీ ఒకే చట్టాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. దీని అమలు పరచాలని సుప్రీంకోర్టు కూడా ప్రభుత్వానికి సూచించింది. దీన్ని గోవా రాష్ట్రం మాత్రమే అమలు పరుస్తోంది.

## నిబంధన 45

◆ ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి. శిశు, పూర్వ శిశు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

## నిబంధన 46

◆ సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యా, సామాజిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి. దీంట్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించారు.

## నిబంధన 47

◆ ప్రజారోగ్య పరిరక్షణ, అంటు వ్యాధుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి. ఆరోగ్యానికి హాని కలిగించే మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలను నిషేధించాలి. మద్యపాన నిషేధాన్ని గుజరాత్ అమలు పరుస్తోంది. ఇటీవల కేరళ ప్రభుత్వం దశలవారీగా నిషేధాన్ని విధించడానికి నిర్ణయించింది.

## నిబంధన 48

◆ వ్యవసాయం, పాడి పరిశ్రమలను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలి. పశువులు, ఇతర పెంపుడు జంతువుల వధను నిర్మూలించాలి. రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని

అందించడానికి ఆచార్య జయశంకర్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

## నిబంధన 48(ఎ)

- మన్యమృగాలను, పర్యావరణాన్ని పరిరక్షించాలి. 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1980లో అడవుల పరిరక్షణ చట్టం, 1988లో జాతీయ అడవుల విధానాన్ని రూపొందించారు.

## నిబంధన 49

- భారతదేశ ఉన్నత సంస్కృతి, వారసత్వం, చారిత్రక ప్రదేశాలను పరిరక్షించాలి. చారిత్రక ప్రదేశాల పరిరక్షణ చట్టాన్ని 1958లో రూపొందించారు. కేంద్ర సాహిత్య అకాడమీ, సంగీత అకాడమీని ఏర్పాటు చేశారు.

## నిబంధన 50

- న్యాయశాఖ ప్రతిపత్తి కాపాడేందుకు కార్యనిర్వాహక శాఖ నుంచి న్యాయశాఖను వేరు చేయాలి.

## నిబంధన 51

- ప్రపంచశాంతి, సమగ్రతకు తోడ్పడాలి. ఇందులో భాగంగానే ఐరాసలో సభ్య దేశంగా చేరాం. ప్రచ్ఛన్న యుద్ధం నుంచి ప్రపంచాన్ని విముక్తి పరిచేందుకు 1961లో అలీన విధానం ఏర్పాటులో కీలకపాత్ర పోషించాం.

## భారత రాజ్యాంగం
# ప్రాథమిక హక్కులు

### సాధారణ విషయాలు

- **12వ ఆర్టికల్ –** నిర్వచనం
- **13వ ఆర్టికల్ –** ప్రాథమిక హక్కులకు అసంగతంగా ఉన్న లేదా ప్రాథమిక హక్కుల స్థాయిని తగ్గింపజేయు శాసనాలు
- **14వ ఆర్టికల్ –** శాసన దృష్టిలో సమానత్వము
- **15వ ఆర్టికల్ –** మత, జాతి, కుల, లింగబేధం లేక జన్మస్థాన కారణాలను బట్టి వివక్షత
- **16వ ఆర్టికల్ –** పబ్లికు (ప్రభుత్వ) ఉద్యోగం విషయంలో సమానావకాశాలు
- **17వ ఆర్టికల్ –** అస్పృశ్యత రద్దు
- **18వ ఆర్టికల్ –** బిరుదులు రద్దు

### స్వేచ్ఛ స్వాతంత్ర్యములకు హక్కు

- **19వ ఆర్టికల్ –** వాక్ స్వాతంత్ర్యము భావ ప్రకటనా స్వేచ్ఛ మొదలగు వాటి విషయంలో రక్షణ
- **20వ ఆర్టికల్ –** అవరాధములకై నేరస్థాపన విషయంలో రక్షణ
- **21వ ఆర్టికల్ –** ప్రాణమునకు మరియు వ్యక్తిగత స్వాతంత్ర్యమునకు రక్షణ
- **21–ఏ వ ఆర్టికల్ –** విద్యకు హక్కు
- **22వ ఆర్టికల్ –** కొన్ని సందర్భాలలో అరెస్టు మరియు నిర్బంధం నుండి రక్షణ

## దోపిడీ నుండి రక్షణ పొందు హక్కు

- ◆ **23వ ఆర్టికల్ –** మనుష్యుల క్రయ విక్రయములు, ప్రతిఫల శూన్యంగా పని చేయించుటపై నిషేధం
- ◆ **24వ ఆర్టికల్ –** ఫ్యాక్టరీలు మొదలైన వాటిలో పిల్లలను ఉద్యోగులుగా నియమించుటపై నిషేధం

## మత స్వాతంత్ర్యమునకు గల హక్కు

- ◆ **25వ ఆర్టికల్ –** అంతరాత్మననుసరించి స్వాతంత్ర్యము, స్వేచ్ఛగా మతావలంబన ఆచరణ మరియు ప్రచారములకు హక్కు
- ◆ **26వ ఆర్టికల్ –** మత వ్యవహార నిర్వహణకు స్వాత్రంత్యము
- ◆ **27వ ఆర్టికల్ –** ఏదేని నిర్దిష్ట మతమును ప్రోత్సహించుటకు పన్నుల చెల్లింపుకు సంబంధించి స్వాతంత్ర్యము
- ◆ **28వ ఆర్టికల్ –** కొన్ని విద్యాసంస్థలలో మత బోధన లేక మతారాధన (పూజాదికములు)

## సాంస్కృతిక మరియు విద్యాపరమైన హక్కు

- ◆ **29వ ఆర్టికల్ –** అల్పసంఖ్యాకవర్గపు హక్కుల పరిరక్షణ
- ◆ **30వ ఆర్టికల్ –** విద్యాసంస్థలు స్థాపించుటకు, నిర్వహించుటకు అల్ప సంఖ్యాకులకు గల హక్కులు
- ◆ **31వ ఆర్టికల్ –** ఆస్తిని నిర్బంధంగా ఆర్జించుట

## కొన్ని శాసనాలకు మినహాయింపు

- ◆ **31-ఏ ఆర్టికల్ –** ఎస్టేట్లు మొదలగు వాటి ఆర్జన కొరకైన శాసనములకు

కల్పించిన మినహాయింపు

- **31-బి ఆర్టికల్ -** కొన్ని చట్టాలు, రెగ్యులేషన్లు శాసనమాన్యత (చెల్లుబడి) కలిగించుట

- **31-సి ఆర్టికల్ -** కొన్ని ఆదేశిక సూత్రముల సాధనకై అమలు పరచు శాసనములకు మినహాయింపు

- **31-డి ఆర్టికల్ -** జాతీయ వ్యతిరేక కార్యకలాపములకు సంబంధించిన శాసనములకు మినహాయింపు తొలగించడింది

## రాజ్యాంగ ప్రత్యుపాయములకు (తరుణోపాయములకు) హక్కు

- **32వ ఆర్టికల్ -** ఈ భాగంచే ఈయబడిన హక్కులను అమలు చేయడానికి ప్రత్యుపాయములు (తరుణోపాయములు)

- **32-ఏ ఆర్టికల్ -** 32వ ఆర్టికలు క్రింద ప్రొసీడింగులలో రాష్ట్ర శాసనముల యొక్క శాసన మాన్యతను పరిశీలనలోకి తీసుకొనకుండుట

- **33వ ఆర్టికల్ -** ఈ భాగం ద్వారా ఈయబడిన హక్కులను సాయుధ దళములకు వర్తింపజేయునపుడు మార్చుటకు పార్లమెంట్‌కు గల అధికారము

- **34వ ఆర్టికల్ -** ఏదేని ప్రాంతంలో సైనిక శాసనం అమల్లో ఉన్నప్పుడు ఈ భాగం ద్వారా ఈయబడిన హక్కులపై ఆంక్షలు

- **35వ ఆర్టికల్ -** ఈ భాగపు నిబంధనలు అమలు పరచుటకు శాసన నిర్మాణము

## భారత రాజ్యాంగం

# ప్రాథమిక విధులు

1997లో 10 ప్రాథమిక విధులు ఉండగా
ప్రస్తుతం 11 అమల్లో (2002 నుంచి) ఉన్నాయి. అవి..

- 51ఏ- రాజ్యాంగానికి లోబడి దాని ఆశయాలను, జాతీయ జెండా, జాతీయ గౌరవాన్ని, రాజ్యాంగ సంస్థలను గౌరవించాలి.
- 51బి- భారత స్వతంత్ర సంగ్రామానికి స్ఫూర్తినిచ్చిన మహోన్నతుల ఆశయాలను గౌరవించాలి.
- 51సి- దేశ సార్వభౌమాధికార ఐక్యత, సమగ్రతను పరిరక్షించాలి.
- 51డి- దేశ రక్షణకు, జాతీయ సేవకు ముందుండాలి.
- 51ఇ- దేశంలో కులాలు, మతాలు, వర్గాల మధ్య సామరస్యానికి కృషి చేస్తూ మహిళలను గౌరవించాలి.
- 51ఎఫ్- భారతీయ సంస్కృతిని, వారసత్వాన్ని పరిరక్షించాలి.
- 51జి- అడవులు, నదులు, సరస్సులు కాపాడటం, వన్యజీవుల పట్ల ప్రేమను రాగం కలిగి ఉండాలి.
- 51హెచ్- శాస్త్రీయ దృక్పథాన్ని, మానవత్వాన్ని, విచారణ ధోరణి, సంస్కరణలను అభివృద్ధి పర్చడం
- 51ఐ- హింసను విడనాడి, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం
- 51జె- వ్యక్తిగతంగా, సమష్టిగా జాతి సర్వతోమాఖాభివృద్ధికి కృషి చేయడం
- 51కె- 6 నుంచి 14 ఏండ్లలోపు పిల్లలందరికీ విద్య అవకాశాలు అందించాలి. అందుకు ప్రతి తల్లిదండ్రులు పిల్లలను విధిగా పాఠశాలకు పంపించాలి.

# భారత రాజ్యాంగం

## (షెడ్యూళ్లు)

## మొదటి షెడ్యూల్

## రాజ్యాంగంలోని 1 మరియు 4వ ఆర్టికల్స్

### రాష్ట్రములు

| | | | |
|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | మహారాష్ట్ర | నాగాలాండు | మిజోరాం |
| అస్సాం | కర్నాటక | హర్యానా | అరుణాచల్‌ప్రదేశ్ |
| బీహార్ | ఒరిస్సా | హిమాచల్ ప్రదేశ్ | గోవా |
| గుజరాత్ | పంజాబు | మణిపూర్ | ఛత్తీస్‌ఘడ్ |
| కేరళ | రాజస్థాన్ | త్రిపుర | ఉత్తరాఖండ్ |
| మధ్యప్రదేశ్ | ఉత్తరప్రదేశ్ | మేఘాలయ | జార్కండ్ |
| తమిళనాడు | పశ్చిమ బెంగాల్ | సిక్కిం | తెలంగాణ |

## కేంద్రపాలిత ప్రాంతాలు

| | | |
|---|---|---|
| ఢిల్లీ | దాద్రా మరియు నాగర్ హవేలి | జమ్మూ, కాశ్మీర్ |
| అండమాన్, నికోబార్ ద్వీపములు | దామన్, డయ్యూ | లద్దాఖ్ |
| | పుదుచ్చేరి | |
| లక్షద్వీప్ | చండీఘర్ | |

## రెండవ షెడ్యూల్

- రాజ్యాంగంలోని 59(3), 65(3), 75(6), 97, 125, 148(3), 158(3), 164(5), 186 మరియు 221 వ ఆర్టికల్స్.

### భాగం - ఏ

- రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్లను గురించిన నిబంధనలు.

### భాగం - బి

- 7వ రాజ్యాంగ సవరణ చట్టం, 1956 సెక్షన్-29 మరియు షెడ్యూల్ ద్వారా రద్దు చేయబడింది.

### భాగం- సి

- లోక్‌సభ స్పీకరు, డిప్యూటీ స్పీకరు, రాజ్యసభ చైర్మను, డిప్యూటీ చైర్మను, రాష్ట్ర శాసనసభ స్పీకరు, డిప్యూటీ స్పీకరు, శాసన పరిషత్తు చైర్మను, డిప్యూటీ చైర్మన్ల నిబంధన.

### భాగం - డి

సుప్రీంకోర్టు మరియు హైకోర్టు న్యాయాధీశులకు జడ్జీలకు సంబంధించిన నిబంధనలు.

**భాగం - ఇ**

- భారత కంప్ట్రోలరు మరియు ఆడిటరు జనరల్ నిబంధనలు.

## మూడవ షెడ్యూల్

- రాజ్యాంగంలోని 75(4), 99, 124(6), 148(2), 164(3), 188 మరియు 219వ ఆర్టికల్స్ మరియు 84(ఎ), 173 (ఎ) వ ఆర్టికల్స్.

## ప్రమాణములు లేదా ప్రతిజ్ఞల నమూనాలు

- కేంద్ర మంత్రిగా పదవీ ప్రమాణపత్రం
- కేంద్రమంత్రి రహస్యగోపన ప్రమాణపత్రం
- పార్లమెంట్ ఎన్నికలో నిలబడటానికి అభ్యర్థి చేయవలసిన ప్రమాణము లేదా ప్రతిజ్ఞ నమూనా
- పార్లమెంట్ సభ్యుడు చేయవలసిన ప్రమాణము లేదా ప్రతిజ్ఞ నమూనా
- సుప్రీం కోర్టు జడ్జి మరియు భారత కంప్ట్రోలరు –ఆడిటరు జనరల్ చేయవలసిన ప్రమాణము లేదా ప్రతిజ్ఞ నమూనా
- రాష్ట్రమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించునపుడు చేయవలసిన ప్రమాణము లేదా ప్రతిజ్ఞ నమూనా
- రాష్ట్రమంత్రిగా రహస్యములను కాపాడుదునని చేయ ప్రమాణపు నమూనా

**ఎ).** రాష్ట్ర శాసన మండలి ఎన్నికలో నిలబడు అభ్యర్థి చేయవలసిన ప్రమాణము లేదా ప్రతిజ్ఞ నమూనా

**బి).** రాష్ట్ర శాసనమండలి సభ్యుడు చేయవలసిన ప్రమాణము లేదా ప్రతిజ్ఞ నమూనా

- హైకోర్టు జడ్జి చేయవలసిన ప్రమాణం లేక ప్రతిజ్ఞ నమూనా

## నాల్గవ షెడ్యూల్

◆ రాజ్యాంగంలోని 4(1) మరియు 80(2) వ ఆర్టికల్స్
రాజ్యసభలో స్థానములు (సీట్ల) కేటాయింపు

## ఐదవ షెడ్యూల్

◆ రాజ్యాంగంలోని 244(1) వ ఆర్టికల్స్

◆ షెడ్యూల్డ్ ప్రాంతాలు మరియు షెడ్యూల్ తెగల పరిపాలన మరియు నియంత్రణ గురించిన నిబంధన

## భాగము - ఏ

### సాధారణ విషయాలు

◆ అర్థాన్వయము ***(Interpretation)***

◆ షెడ్యూల్ ప్రాంతాలలో రాష్ట్ర కార్యపాలనాధికారము ***(Executive Power)***

◆ షెడ్యూల్ ప్రాంతాల పరిపాలన గూర్చి గవర్నరు, రాష్ట్రపతికి రిపోర్టు చేయుట

## భాగము - బి

◆ షెడ్యూల్ ప్రాంతముల మరియు షెడ్యూల్డ్ తెగల పరిపాలన మరియు నియంత్రణ

◆ (షెడ్యూల్) తెగల సలహా కౌన్సిల్

◆ షెడ్యూల్ ప్రాంతములకు వర్తించదగు శాసనము

## భాగము - సి

◆ షెడ్యూల్ ప్రాంతములు

## భాగము - డి

◆ షెడ్యూలును సవరించుట

## ఆరవ షెడ్యూల్

రాజ్యాంగంలోని 244(2) మరియు 275(1) వ ఆర్టికల్స్
అస్సాం, మేఘాలయ, త్రిపుర మరియు మిజోరాం రాష్ట్రములలోని ఆదివాసీ ప్రాంతముల పరిపాలన గురించిన నిబంధన

◆ స్వయం ప్రతిపత్తి జిల్లాలు మరియు స్వయం ప్రతిపత్తి ప్రాంతములు

◆ జిల్లా కౌన్సిళ్లు మరియు ప్రాంతీయ కౌన్సిళ్ల ఏర్పాటు

◆ శాసనములను చేయుటకు జిల్లా కౌన్సిలు మరియు ప్రాంతీయ కౌన్సిళ్ల అధికారములు

◆ స్వయం ప్రతిపత్తి గల జిల్లాలలో మరియు స్వయంప్రతిపత్తి గల ప్రాంతములలో న్యాయ పరిపాలన

◆ కొన్ని దావాలను, కేసులను మరియు అపరాథములను విచారణ చేయు ప్రాంతీయ కౌన్సిళ్లకును, జిల్లా కౌన్సిళ్లకును, కొన్ని కోర్టులకును, కొందరు అధికారులకును, సివిలు ప్రక్రియాస్మృతి, 1908 క్రింద మరియు క్రిమినలు ప్రక్రియాస్మృతి, 1973 క్రింద అధికారములను దాఖలు పరచుట

◆ ప్రాథమిక పాఠశాలు మన్నగునవి స్థాపించుటకు జిల్లా కౌన్సిలుకుగల అధికారములు

## జిల్లా మరియు ప్రాంతీయ నిధులు

◆ భూమిశిస్తును నిర్ధారణ చేయుటకును, వసూలు చేయుటకును మరియు పన్నులను విధించుటకును అధికారము

◆ ఖనిజములను కనుగొనుటకును లేక వాటిని వెలికితీయుటకును లైసెన్సులు లేక లీజులు

- ఆదివాసేతురులచే చేయబడు వడ్డీ వ్యాపారము మరియు వ్యాపారము యొక్క నియంత్రణకై రెగ్యులేషన్లు చేయుటకు జిల్లా కౌన్సిలుకుగల అధికారము

- ఈ షెడ్యూలు క్రింద చేయబడు శాసనములు, రూల్స్ మరియు రెగ్యులేషన్ల ప్రచురణ

- అస్సాం రాష్ట్రంలోని స్వయం ప్రతిపత్తిగల జిల్లాలకును స్వయం ప్రతిపత్తి గల ప్రాంతములకును, పార్లమెంటు మరియు అస్సాం రాష్ట్ర శాసనమండలి చట్టముల వర్తింపు

**(ఏ).** మేఘాలయ రాష్ట్రములోని స్వయంప్రతిపత్తి గల జిల్లాలకును, స్వయంప్రతిపత్తి గల ప్రాంతములకును పార్లమెంటు యొక్క మరియు మేఘాలయ రాష్ట్ర శాసనమండలి యొక్క చట్టముల వర్తింపు

**(ఏఏ).** పార్లమెంట్ చట్టములు మరియు త్రిపుర రాష్ట్ర శాసనమండలి చట్టములు, త్రిపుర రాష్ట్రములోని స్వయంప్రతిపత్తి గల జిల్లాలకు మరియు స్వయంప్రతిపత్తి గల ప్రాంతములకు వర్తించుట

**(బి).** మిజోరాం రాష్ట్రంలోని స్వయంప్రతిపత్తి గల జిల్లాలకు మరియు స్వయం ప్రతిపత్తి గల ప్రాంతములకును పార్లమెంటు యొక్క మరియు మిజోరాం రాష్ట్ర శాసన మండలి యొక్క చట్టముల వర్తింపు

- స్వయంప్రతిపత్తి జిల్లాలకు సంబంధించి అంచనా వేయబడిన రాబడులను, వ్యయములను వార్షిక ఆర్థిక వివరణ యందు వేరువేరుగ చూపుట

- స్వయంప్రతిపత్తి గల జిల్లాల యొక్క మరియు స్వయంప్రతిపత్తి గల ప్రాంతముల యొక్క పరిపాలనను గూర్చి పరిశీలన చేయుటకును మరియు రిపోర్టు ఇచ్చుటకును కమీషనును నియమించుట

- జిల్లా మరియు ప్రాంతీయ కౌన్సిళ్ల కార్యములను, తీర్మానములను రద్దు చేయుట లేక సస్పెండ్ చేయుట

- ఒక జిల్లా లేక ప్రాంతీయ కౌన్సిలు విఘటన ***(Dissolution)***

- స్వయంప్రతిపత్తి జిల్లాలలోని నియోజక వర్గములను ఏర్పరచుటలో అట్టి జిల్లాల నుండి ప్రాంతముల మినహాయింపు
- యాక్టు, 1971
- పరివర్తనకాలిక నిబంధనలు ***(Transitional)***
- ఆదివాసీ ప్రాంతములు

**(ఏ).** మిజో జిల్లా కౌన్సిలు రద్దు

**(బి).** మిజోరాం కేంద్రపాలిత ప్రాంతంలోని స్వయం ప్రతిపత్తి గల ప్రాంతములు స్వయంప్రతిపత్తి జిల్లాలుగా నుండుట, తత్ఫలితంగా పరివర్తనకాలిక నిబంధనలు

**(సి).** అన్వయము ***(Interpretation)***

- షెడ్యూలు సవరణ

## ఏడవ షెడ్యూల్

- రాజ్యాంగంలోని 246 వ ఆర్టికల్స్
- యూనియన్ జాబితా (జాబితా 1)
- రాష్ట్ర జాబితా (జాబితా 2)
- ఉమ్మడి జాబితా (జాబితా 3)

## ఎనిమిదవ షెడ్యూల్

- రాజ్యాంగంలోని 344(1) మరియు 351 వ ఆర్టికల్స్

## భాషలు

| | |
|---|---|
| 1. అస్సామీ | 7. కన్నడము |
| 2. బెంగాలీ | 8. కాశ్మీరీ |
| 3. బోడో | 9. కొంకణి |
| 4. డోగ్రి | 10. మైథిలీ |
| 5. గుజరాతీ | 11. మళయాళము |
| 6. హిందీ | 12. మణిపురి |

## తొమ్మిదవ షెడ్యూల్

రాజ్యాంగంలోని 31బి వ ఆర్టికల్స్

***(Added by the Const. (1st Amdt.) Act, 1951)***

మొదటి రాజ్యాంగ సవరణ చట్టం, 1951లో పొందుపర్చబడినవి

## పదవ షెడ్యూల్

రాజ్యాంగంలోని 102 (2) మరియు 191(2) వ ఆర్టికల్స్

పార్టీ ఫిరాయింపు కారణంగా అనర్హతలను కలిగించుట గురించిన నిబంధన అర్థాన్వయము

- పార్టీ ఫిరాయింపు కారణముపై అనర్హత
- ***(Omitted by the Const. (91st Amdt.) Act, 2003, w.e.f. 1-1-2004)***
- పార్టీలు విలీనం జరిగిన సందర్భాలలో ఫిరాయింపు అనర్హతలకు వర్తింపజేయకుండుట

- మినహాయింపులు
- పార్టీ ఫిరాయింపుల కారణంగా అనర్హత గురించి ఏర్పడ్డ ప్రశ్నలపై నిర్ణయము
- న్యాయ స్థానముల అధికారిత తొలగింపు
- నియమములు

## పదకొండవ షెడ్యూల్

రాజ్యాంగంలోని 243*G* వ ఆర్టికల్స్

- వ్యవసాయ విస్తరణతోసహా వ్యవసాయం
- భూమి అభివృద్ధి, భూసంస్కరణల అమలు, భూమి స్థిరీకరణ, భూసార పరిరక్షణ
- చిన్నతరహా నీటిపారుదల, నీటి నిర్వహణ, వాటర్‌షెడ్ అభివృద్ధి
- పశుసంవర్ధన, పాడి పరిశ్రమ, కోళ్లపరిశ్రమ
- చేపల చెరువులు
- సామాజిక అడవులు, వ్యవసాయ క్షేత్రాల్లోని అడవుల అభివృద్ధి
- చిన్నతరహా అటవీ ఉత్పత్తులు
- ఆహార ప్రాసెస్సింగు పరిశ్రమలతో సహా చిన్నతరహా పరిశ్రమలు.
- ఖాదీ, గ్రామీణ, కుటీర పరిశ్రమలు
- గ్రామాలలో గృహ వసతి
- మంచినీరు
- ఇంధనం, పశుగ్రాసం
- రోడ్లు, చిన్న వంతెనలు, ఫెర్రీలు, జలమార్గములు, ఇతర రాకపోకలు సాధనములు

- విద్యుత్ పంపిణీతో సహా, గ్రామీణ ప్రాంతాల విద్యుదీకరణ
- సంప్రదాయేతర ఇంధన వనర్లు
- పేదరిక నిర్మూలన కార్యక్రమం
- ప్రాథమిక, సెకండరీ పాఠశాల స్థాయి విద్యతో సహా విద్య
- సాంకేతిక శిక్షణ, వృత్తివిద్య
- వయోజన మరియు అనియత విద్య
- గ్రంథాలయములు
- సాంస్కృతిక కార్యకలాపాలు
- మార్కెట్లు, సంతలు
- ఆరోగ్యం, పారిశుధ్యం, అసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, డిస్పెన్సరీలు
- కుటుంబ సంక్షేమం
- మహిళా, శిశు అభివృద్ధి
- సాంఘిక సంక్షేమం, వికలాంగుల, మానసిక వికలాంగుల సంక్షేమంతో సహా
- బలహీన వర్గాల వారి ముఖ్యంగా, షెడ్యూల్ తెగలు, షెడ్యూలు కులాల సంక్షేమం
- ప్రజాపంపిణీ వ్యవస్థ
- సామాజిక ఆస్తుల పరిరక్షణ

## పన్నెండవ షెడ్యూల్

రాజ్యాంగంలోని 243-డబ్ల్యు వ ఆర్టికల్స్

- ***(Inst. by the Const. (74th Amdt.) Act, 1992)***

- పట్టణ ప్రణాళిక, టౌను ప్లానింగుతోసహా
- భూమి వినియోగ భవనముల నిర్మాణం క్రమబద్ధీకరణ
- ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రణాళిక
- రోడ్లు వంతెనలు
- గృహ, పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు నీటి సరఫరా
- ప్రజారోగ్యం, పారిశుధ్యం, మురుగునీరు ఘనవ్యర్థ పదార్థాల నిర్మూలన
- అగ్నిమాపక సర్వీసులు
- పట్టణ ప్రాంతాలలో వనాల పెంపకం, పరిసరాల రక్షణ, పర్యావరణ అంశాలను ప్రోత్సహించడం
- వికలాంగులు, మానసిక వికలాంగులతోసహా బలహీన వర్గాల శ్రేయస్సులను పెంపొందించుట
- మురికివాడలలో అభివృద్ధి పనులు, వారి సౌకర్యాలను మెరుగుపరచడం
- పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన
- పట్టణాలలో సౌకర్యాలు, పార్కులు, వనాలు, ఆటస్థలాలు వంటి వాటిని కల్పించుట
- సాంస్కృతిక, విద్యాపరమైన, మనోల్లాసపరమైన అంశాలను అభివృద్ధి పరచటం
- దహన వాటికలు, ఖనన వాటికలు, విద్యుత్ దహన వాటికలు
- పశువులు నీరు త్రాగుటకు మడుగులు, జంతువుల పట్ల క్రూరత్వ నిషేధం
- జనన మరణాల రిజిస్ట్రేషనుతోసహా, ముఖ్యమైన గణాంక వివరాల సేకరణ
- వీధిదీపాల కల్పన, పార్కింగు ప్రదేశాలు, బస్సు స్టాపులతోసహా ప్రజా వసతులు, ప్రజా సౌకర్యాలను మెరుగుపరచడం
- కబేళాలు (పశువధశాలలు), తోలును శుభ్రము చేయు స్థలాలను క్రమబద్ధీకరించటం.

భారత రాజ్యాంగం

# ముఖ్య సవరణలు

మారుతున్న పరిస్థితులు, ఎదురవుతున్న సవాళ్లు, పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో.. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భంగం కలగకుండా వివిధ లక్ష్యాలతో రాజ్యాంగాన్ని ఇప్పటివకు 103 సార్లు సవరించారు. వాటిలో ముఖ్యమైనవి...

## 1వ సవరణ 1951

- భూ సంస్కరణలు, ఇతర చట్టాలకు న్యాయ సమీక్ష నుంచి రక్షణ కల్పించారు. మాట్లాడే హక్కుకు 3 పరిమితులను విధించారు.

## 7వ సవరణ 1955

- దేశాన్ని భాషా ప్రాతిపదికన 14 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాలుగా పునర్విభజించారు. భాషల పరిరక్షణకు ప్రాథమిక పాఠశాలల్లో మాతృభాషలోనే బోధించేలా 350ఏ ప్రకరణ జోడించారు.

## 24వ సవరణ 1971

- రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించే అధికారం లోక్‌సభకు కట్టబెట్టారు. ఏదైనా రాజ్యాంగ సవరణను పార్లమెంట్ ఉభయసభలు అంగీకరించి, రాష్ట్రపతికి నివేదిస్తే ఆయన తప్పనిసరిగా ఆమోదించాలన్నారు.

## 42వ సవరణ 1976

- సామ్యవాద, లౌకిక, సమగ్రత అనేక మూడు పదాలను ప్రవేశికకు అదనంగా జోడించారు. పౌరులకు ప్రాథమిక విధులను నిర్దేశించారు.

- న్యాయ సమీక్ష, రిట్ పిటిషన్ల విచారణలో సుప్రీం, హైకోర్టుల పరిధి తగ్గించి, రాజ్యాంగ సవరణలను న్యాయసమీక్ష పరిధి నుంచి తొలగించారు.
- జాతీయ న్యాయ సేవల సంస్థను ఏర్పాటు చేశారు.

### 44వ సవరణ 1978

- అత్యయిక పరిస్థితి ప్రకటించే నిబంధనలో అంతర్గత సమస్యలు అనే పదం స్థానంలో సైనిక తిరుగుబాటు అనే పదాన్ని చేర్చారు.
- కేంద్ర మంత్రివర్గం రాతపూర్వక సలహా ఇస్తేనే రాష్ట్రపతి అత్యయిక పరిస్థితిని విధించాలి.
- ప్రాథమిక హక్కుల జాబితా నుంచి ఆస్తిహక్కు తొలగింపు

### 73, 74 సవరణలు 1992

- గ్రామ పంచాయితీలు, పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగబద్ధ హోదా కల్పించారు. మున్సిపాలిటీలు అనే కొత్త భాగాన్ని చేర్చారు. అన్ని స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలకు ఆదేశం.

### 86వ సవరణ 2002

- కొత్తగా విద్యాహక్కును చేర్చారు. 6 నుంచి 14 ఏళ్ల వయసులోని బాలబాలికలు అందరికీ ఉచిత, నిర్బంధ విద్య అందించాలని నిర్దేశించారు.

### 97వ సవరణ 2013

- సహకార సంఘాలకు రాజ్యాంగ హోదా

### 101వ సవరణ 2016

- దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ని అమలులోకి తెస్తూ కొత్తగా 269ఏ, 279ఏ ప్రకరణల ఏర్పాటు

**102వ సవరణ 2018**

◆ వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ ఏర్పాటు, బీసీల జాబితాలో మార్పులు, చేర్పులపై అధ్యయనం చేసే బాధ్యత అప్పగింత.

**103వ సవరణ 2019**

◆ విద్య, ఉద్యోగాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10% రిజర్వేషన్ల కల్పన.

**ఓటు హక్కు 18 ఏళ్లకు :**

◆ రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 1988లో రాజ్యాంగానికి 61వ సవరణ చేశారు. అప్పటివరకు 21 ఏళ్లుగా ఉన్న ఓటు హక్కు వయసును ఏకంగా మూడేళ్లు తగ్గిస్తూ 18 ఏళ్లకు కుదించారు. నాటి నుంచే నవ యువత సైతం ఓటేస్తోంది.

భారత రాజ్యాంగం

## రూప కల్పన- ప్రధాన ఘట్టాలు

- 1930ల నుంచే సొంత రాజ్యాంగం కోసం డిమాండ్లు మొదలయ్యాయి.
- ఎన్నో తర్జనభర్జనల, గొడవల తర్వాత 1946లో వైస్రాయ్ లార్డ్ వావెల్ ఇందుకు అంగీకరించారు.
- రాజ్యాంగ పరిషత్తులో ప్రతీ వర్గానికి ప్రాతినిధ్యం లభించింది. 9 మంది మహిళలు ఇందులో ఉన్నారు. 24 మంది అమెరికన్లు కూడా రాజ్యాంగ చర్చలో ఏడు రోజుల పాటు పాల్గొన్నారు.
- రాజ్యాంగ రచన సమయంలోనే దేశంలో మతఘర్షణలు, కులపోరాటాలు చోటు చేసుకున్నాయి.
- దీంతో ప్రాథమిక విలువలైన సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సౌభ్రాతృత్వాలను రాజ్యాంగంలో చేర్చారు.
- రాజ్యాంగ రచనకు 1946 నుంచి 1949 మధ్య రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది.
- రాజ్యాంగ నిజప్రతిని ప్రఖ్యాత లేఖకుడు ప్రేమ్ బిహారీ నారాయణ్ చేత్తో రాశారు. ఇందుకు ఆయనకు ఆరు నెలలు పట్టింది. ఇందుకు ఒక్క పైసా తీసుకోలేదు.
- ఫ్రాన్స్ నుంచి స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం, రష్యా నుంచి ప్రాథమిక విధులు, పంచవర్ష ప్రణాళికలు, ఐర్లాండ్ నుంచి ఆదేశిక సూత్రాలు, అమెరికా నుంచి ప్రాథమిక హక్కులు, సుప్రీంకోర్టు విధులు, కెనడా నుంచి కేంద్ర ప్రభుత్వ సమాఖ్య, యూకే నుంచి ప్రధానమంత్రి, కేబినెట్, పార్లమెంటు తరహా ప్రభుత్వాన్ని తీసుకున్నారు.

- ◆ వివిధ భాషల్లో రాజ్యాంగ పరిషత్తులో చర్చ జరిగినా... రాజ్యాంగాన్ని మాత్రం హిందీ, ఇంగ్లీషు భాషల్లోనే రాశారు.
- ◆ 1949, నవంబర్26న భారత రాజ్యాంగాన్ని.. రాజ్యాంగ సభ ఆమోదించింది.
- ◆ 1950, జనవరి 26 రాజ్యాంగ అమలు ప్రారంభం కావటంతో... గణతంత్ర రాజ్యంగా భారత్ ఆవిర్భవించింది.
- ◆ ఇప్పటికీ రాజ్యాంగం నిజప్రతులు పార్లమెంటు లైబ్రరీలోని హీలియం చాంబర్స్‌లో భద్రంగా ఉన్నాయి.
- ◆ దీనికి ఓ రూపు తీసుకు వచ్చేందుకు రాజ్యాంగ పరిషత్ 166 సార్లు సమావేశమైంది.
- ◆ ఇందులో 144 రోజులు రాజ్యాంగ ముసాయిదాపైనే చర్చ జరిగింది.
- ◆ చర్చ సందర్భంగా ప్రతిపాదించిన 7,635 సవరణల్లో 2,473 సవరణలను తిరస్కరించారు.
- ◆ ప్రపంచంలోనే అతిపెద్దదైన మన రాజ్యాంగంలో 25 భాగాలు, 12 షెడ్యూళ్లు, 448 అధికరణల, 5 అనుబంధాలున్నాయి.